


RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం


సంప్రదించవలసిన నెం : 9397303326



రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 450 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | గురువారం 31 జూలై 2025 | వెల : 4/-


# గులాబీకి దూరమౌతున్న కేసీఆర్ సహచరులు

- తెలంగాణ ఉద్యమ కాలం నుంచి కేసీఆర్‌కు కుడి భుజంగా వ్యవహరించిన అత్యంత సన్నిహితుడు
- రాజకీయాల నుండి పక్కకు తప్పించే ప్రయత్నం చేస్తున్నారట
- కేసిఆర్ వర్సెస్ కేటీఆర్ అనేలా మారాయన్న టాక్ హాట్ టాపిక్‌గా మారిందిప్పుడు.. కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడు మధుసూదనాచారి
- కేటీఆర్ పొలిటికల్ ఎంట్రీ ఇవ్వక ముందు నుంచే ఉమ్మడి వరంగల్ జిల్లా భూపాలపల్లి రాజకీయాల్లో ఫోకస్ అయిన సీనియర్..



హైదరాబాద్

తెలంగాణ మాజీ స్పీకర్ మధుసూదనాచారి.. టిఆర్ఎస్ వ్యవస్థాపక నాయకుడు ? తెలంగాణ ఉద్యమ కాలం నుంచి కేసీఆర్‌కు కుడి భుజంగా వ్యవహరించిన అత్యంత సన్నిహితుడు. కేటీఆర్ పొలిటికల్ ఎంట్రీ ఇవ్వక ముందు నుంచే ఉమ్మడి వరంగల్ జిల్లా భూపాలపల్లి రాజకీయాల్లో ఫోకస్ అయిన సీనియర్.. అలాంటి నాయకునిపైనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కక్షగట్టారట. రాజకీయాల నుండి పక్కకు తప్పించే ప్రయత్నం చేస్తున్నారట. దీంతో ఆ నియోజకవర్గంలోని రాజకీయాలు? కేసిఆర్ వర్సెస్ కేటీఆర్ అనేలా మారాయన్న టాక్ హాట్ టాపిక్‌గా మారిందిప్పుడు.. కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడు మధుసూదనాచారి. తొలి తెలంగాణ సభాపతి, ప్రస్తుత శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అంటే తెలుగు రాజకీయాల్లో తెలియని వారు ఉండరు. ఉమ్మడి వరంగల్ జిల్లా భూపాలపల్లి నుండి గతంలో ఎమ్మెల్యేగా గెలిచిన బీసీ నాయకుడు. టీడీపీ ఆవిర్భావ సమయంలో రాజకీయ జీవితం - మిగతా3లో

### వాణిజ్య పన్నుల శాఖ దాడులు..

## వెలుగులోకి భారీ మోసం

- ప్రైవేట్ సంస్థ ఎంఎస్ కీషాన్ ఇండస్ట్రీస్ ఎల్ఎల్‌పీ ప్రధాన పాత్ర
- బన్సీలాల్‌పేట గోదాం, మెదక్ జిల్లాలోని కలకల్ ఆటోమోటివ్ పార్క్, ముప్పిరెడ్డిపల్లి గ్రామాల్లోని తయారీ యూనిట్లలో అధికారులు సోదాలు
- సరుకులు తరలించకుండా భారీ విలువ కలిగిన కాపర్ సరుకుల సప్లైకి సంబంధించి పన్ను బిల్లులు జారీ చేసినట్లు అధికారులు అనుమానం




హైదరాబాద్

తెలంగాణలో వాణిజ్య పన్నుల శాఖ తనిఖీల్లో భారీ పన్ను మోసం వెలుగులోకి వచ్చింది. కేసులో హైదరాబాద్‌లోని ప్రైవేట్ సంస్థ ఎంఎస్ కీషాన్ ఇండస్ట్రీస్ ఎల్ఎల్‌పీ ప్రధాన పాత్ర ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సికింద్రాబాద్‌లోని బన్సీ లాల్‌పేట గోదాం, మెదక్ జిల్లాలోని కలకల్ ఆటోమోటివ్ - మిగతా3లో

### భారత్‌పై 25% సుంకాలు విధించిన ట్రంప్

- ఆగస్టు 1 నుంచి ఇవి అమల్లోకి
- "భారత్ మిత్రదేశమే అయినా.. సుంకాలు ఎక్కువగా ఉన్నందున వారితో పరిమిత స్థాయిలో వ్యాపారాలు చేస్తున్నాం.
- ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటి : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



### జీఎస్ఎల్‌వీ ఎఫ్16 ప్రయోగం సక్సెస్

- ఇస్రో, నాసాల ఉమ్మడి ఉపగ్రహమైన నిసార్ శాటిలైట్ జీఎస్ఎల్‌వీ ఎఫ్16 నింగిలోకి దూసుకెళ్లింది.
- నింగిలోకి వెళ్లిన నిస్సార్ ఉపగ్రహం భూమిని స్కాన్ చేయడం ప్రారంభించింది.
- చంద్రయాన్-4 ప్రయోగ పనులకు శ్రీకారం

### 'నో హెల్మెట్.. నో పెట్రోల్'..

- ఆ జిల్లాలో ఆగస్టు 1 నుంచే అమలు!
- ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లేకుండా పెట్రోల్ పంపుల వద్దకు వస్తే.. వారికి ఇంధనం నింపేందుకు అనుమతి నిరాకరించనుంది.
- మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్ జిల్లా యంత్రాంగం కీలక చర్యలకు సిద్ధమైంది.

### ఆగస్టు 4వ తేదీ వరకు

## కాంగ్రెస్ పాదయాత్ర

- సీఎం రేవంత్‌తో మీనాక్షి నటరాజన్, మహేష్‌గౌడ్ భేటీ.. కీలక అంశాలపై చర్చ
- పార్టీ నిర్మాణం, పాదయాత్ర, బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీలో పోరాట కార్యాచరణ
- ఆగస్టు 5,6,7 మూడురోజుల పాటు 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదానికై ఢిల్లీలో కార్యాచరణ
- ఆగస్టు 6న జంతర్ మంతర్ వద్ద ధర్నా

హైదరాబాద్

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో టీ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఇవాళ(బుధవారం జులై 30) భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించారు. పార్టీ నిర్మాణం, పాదయాత్ర, బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీలో పోరాట కార్యాచరణపై మాట్లాడారు. దాదాపు గంటన్నరపాటు సుదీర్ఘంగా చర్చించారు. ఈ నెల(జులై) 31వ తేదీ నుంచి వచ్చే నెల (ఆగస్టు) 4వ తేదీ వరకు యథావిధిగా కాంగ్రెస్ పాదయాత్ర చేపట్టనుంది. ఆగస్టు 5,6,7 మూడురోజుల పాటు 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదానికై ఢిల్లీలో కార్యాచరణ రూపొందించారు. ఆగస్టు 5వ తేదీన పార్లమెంటు ఉభయ సభల్లో ఎంపీల వాయిదా తీర్మానం, చర్చకు పట్టుబట్టే అవకాశం ఉంది. ఆగస్టు 6న జంతర్ మంతర్ వద్ద ధర్నా - మిగతా3లో



### కాళేశ్వరం కమిషన్ రిపోర్టుతో

## అసెంబ్లీలో చర్చ

- కీలక నిర్ణయాల దిశగా రేవంత్ ప్రభుత్వం..!
- ఇప్పటికే కాళేశ్వరం కమిషన్ విచారణ పూర్తయింది.
- ఆగస్టు 1వ తేదీ లేదా 2వ తేదీన తెలంగాణ ప్రభుత్వానికి కాళేశ్వరం రిపోర్ట్ అందజేయనుంది
- జస్టిస్ ఘోష్ కమిషన్ గడువును మరో 2, 3 రోజులు రేవంత్ ప్రభుత్వం పెంచే అవకాశాలు
- గత కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరంలో భారీగా అవినీతికి పాల్పడిందనే ఆరోపణలు



హైదరాబాద్

కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌పై ఉత్కంఠ నెలకొంది. గురువారంతో జస్టిస్ ఘోష్ కమిషన్ గడువు ముగియనుంది. ఇప్పటికే కాళేశ్వరం కమిషన్ విచారణ పూర్తయింది. రేపు ఫైనల్ రిపోర్టుపై పీసీ ఘోష్ సంతకం చేయనున్నారు. ఆగస్టు 1వ తేదీ లేదా 2వ తేదీన తెలంగాణ ప్రభుత్వానికి కాళేశ్వరం రిపోర్ట్ అందజేయనుంది. - మిగతా3లో



### కాల్పుల విరమణకు

## పాక్ అడుక్కుంది

- పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ప్రపంచానికి తెలియజేశాం
- పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలను భారత సైన్యం 'సిందూర్' పేరిట చేపట్టిన ఆపరేషన్‌తో ధ్వంసం చేసింది.
- కాల్పుల విరమణలో ఏ దేశం మధ్యవర్తిత్వం వహించలేదు
- భారత విదేశాంగ మంత్రి జై శంకర్

# కాల్పుల విరమణకు పాక్ అడుక్కుంది



కాల్పుల విరమణలో ఏ దేశం మధ్యవర్తిత్వం వహించలేదని భారత విదేశాంగ మంత్రి జై శంకర్ పార్లమెంట్ వేదికగా మరోసారి స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్‌పై చర్చలో భాగంగా బుధవారం రాజ్యసభలో ఆయన ప్రసంగించారు. రక్తం, నీరు కలిసి ప్రవహించలేవని.. అందుకే పాక్‌తో సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేశామని వ్యాఖ్యానించారాయన. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ప్రపంచానికి తెలియజేశాం. పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలను భారత సైన్యం 'సిందూర్' పేరిట చేపట్టిన ఆపరేషన్‌తో ధ్వంసం చేసింది. కాల్పుల విరమణకు పాకిస్థాన్ అడుక్కుంది. అంతేగానీ కాల్పుల విరమణలో ఏ దేశం మధ్యవర్తిత్వం వహించలేదు అని అన్నారాయన. ఆపరేషన్ సిందూర్ సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఎలాంటి సంభాషణలు జరగలేదని జై శంకర్ వివరించారు. ఆ సమయంలో చాలా దేశాలు దౌత్యానికి ముందుకొచ్చాయి. కానీ, జోక్యం సరికాదని ఆయా దేశాలకు చెప్పాం అని జైశంకర్ అన్నారు. "వాళ్లకు(ప్రతిపక్షాలకు) ఒక్కటే చెప్పదల్చుకున్నా.. ఏప్రిల్ 22 నుంచి జూన్ 16 మధ్య ఆ ఇద్దరు నేతలకు ఒక్క ఫోన్ కాల్ సంభాషణ జరగలేదు" అని స్పష్టం చేశారాయన. మే 9వ తేదీన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రధాని మోదీకి ఫోన్ చేశారు. పాక్ నుంచి దాడులు జరగవచ్చని హెచ్చరించారాయన. అయితే అలాంటి పరిస్థితి వస్తే భారత్ నుంచి ప్రతిఘటన తీవ్రంగా ఉంటుందని మోదీ వాన్స్‌తో చెప్పారు. ఆర్టికల్ 370, సింధూ జలాల ఒప్పందం.. నెహ్రూ పాలనలో జరిగిన ఈ తప్పిదాలను మోదీ సర్కార్ ఇప్పుడు సరిదిద్దుతోంది. ఉగ్రవాదాన్ని గ్లోబల్ ఎజెండాలో చేర్చడం ప్రధాని మోదీ వల్లే సాధ్యమైంది అని జైశంకర్ అన్నారు. రక్తం, నీరు కలిసి ప్రవహించలేవని.. అందుకే పాక్‌తో సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేశామని, పాక్ ఉగ్రవాదాన్ని విడిచిపెట్టేదాకా ఈ పరిస్థితి ఇలాగే కొనసాగుతుందని స్పష్టం చేశారారయన.

# జీఎస్ఎల్వీ ఎఫ్16 ప్రయోగం సక్సెస్




**నెల్లూరు:** ఇస్రో, నాసాల ఉమ్మడి ఉపగ్రహమైన నిసార్ శాటిలైట్ జీఎస్ఎల్వీ ఎఫ్16 నింగిలోకి దూసుకెళ్లింది. దీంతో ఈ ప్రయోగం విజయవంతమైంది. నింగిలోకి వెళ్లిన నిస్సార్ ఉపగ్రహం భూమిని స్కాన్ చేయడం ప్రారంభించింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) తొలిసారిగా సంయుక్తంగా రూపొందించిన నాసా-ఇస్రో సింథటిక్ ఆపార్చర్ రాడార్ (నిసార్) అనే ఉపగ్రహం నిసార్ శాటిలైట్ జీఎస్ఎల్వీ ఎఫ్16 నింగిలోకి దూసుకెళ్లింది. బుధవారం సాయంత్రం 5.40 గంటలకు ఈ ప్రయోగం ప్రారంభమైంది జియో సింక్రనస్ లాంచింగ్ వెహికల్ (జీఎస్ఎల్వీ ఎఫ్16) రాకెట్ ద్వారా 2,392 కేజీల బరువు కలిగిన నిసార్ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపారు ఇస్రో సైంటిస్టులు . 98.40 డిగ్రీల వంపుతో భూమికి 743 కిలోమీటర్ల ఎత్తులోని సూర్య-సమకాలిక కక్ష్యలోకి నిసార్‌ను ప్రవేశపెట్టారు. భూగోళాన్ని పరిశోధించేందుకు ఎంతో దోహదపడే ఈ ఉపగ్రహం సుమారు 10 ఏళ్లు పాటు సేవలు అందిస్తుంది. భూ కదలికలను నిశితంగా పరిశీలించేందుకు... దాదాపు 11 వేల 200 కోట్ల రూపాయలతో వ్యయంతో నాసా, ఇస్రో సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపట్టాయి.

**భవిష్యత్తులో ఇస్రో-నాసా కలిసి మరిన్ని ప్రయోగాలు..**

ఈప్రయోగం సందర్భంగా ఇస్రో, నాసా బంధం బలపడి రాబోయే కాలంలో మరో మూడు ప్రయోగాలను సంయుక్తంగా నిర్వహించేందుకు ఒప్పందం చేసుకున్నామని ఇస్రో చైర్మన్ డాక్టర్ కె.నారాయణన్ పేర్కొన్నారు. అలాగే, చంద్రయాన్-4 ప్రయోగ పనులకు శ్రీకారం చుడుతున్నామని చెప్పారు. ఈ ఏడాది ఆఖరు నాటికి గగన్‌యాన్-1 పేరుతో ప్రయోగం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పీఎస్ఎల్వీ సిరీస్‌లో కూడా మరో నాలుగు ప్రయోగాలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

## కోర్టు గది సరిపోదు.. క్రికెట్ స్టేడియం కావాలేమో..!

# సెంథిల్ బాలాజీ కేసులో సుప్రీం వ్యాఖ్యలు!



తమిళనాడు ప్రభుత్వం తీరుపై సర్వోన్నత న్యాయస్థానం బుధవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. మాజీ మంత్రి వీ సెంథిల్ బాలాజీ ప్రమేయం ఉన్న ఉద్యోగ కుంభకోణంపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి మాజీ మంత్రి డబ్బులు తీసుకున్నట్లుగా అభియోగాలు నమోదైన విషయం తెలిసిందే. జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మల్య బాగ్చి ధర్మాసనం తమిళనాడు సర్కారుపై మండిపడింది. ప్రభుత్వం కావాలనే విచారణను ఆలస్యం చేస్తున్నట్లుగా కనిపిస్తోందని మండిపడింది. ప్రభుత్వం కేసును మూసివేసేందుకు ప్రయత్నిస్తే.. న్యాయశాఖ అడ్డుకుందంటూ మందలించింది. ఈ కేసులో 2000 మంది నిందితులు, 500 మంది సాక్షులుగా ఉన్నారన్న ధర్మాసనం.. భారత్‌లో అత్యధిక మంది విచారణలో పాల్గొన్న కేసు ఇదే అవుతుందేమోనని వ్యాఖ్యానించింది. నిందితులందరికీ కోర్టు గది సరిపోదని.. ఓ క్రికెట్ స్టేడియం కావాలంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. నిందితుడు, సాక్షుల పూర్తి వివరాలు సమర్పించాలని సర్వోన్నత న్యాయస్థానం తమిళనాడు సర్కారును ఆదేశించింది. బాలాజీ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్ నారాయణన్ విచారణకు హాజరయ్యారు. అన్నాడీఎంకే హయాంలో సెంథిల్ బాలాజీ రవాణాశాఖ మంత్రిగా పని చేశారు. ఆ సమయంలో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి లంచం తీసుకున్నట్లుగా ఆరోపణలున్నాయి. ఈ మేరకు ఆయనపై కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత ఆయన స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే పార్టీలో చేరి మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రవాణాశాఖ కేసులో ఆయనను ఈడీ 2023లో అరెస్టు చేసింది. దాదాపు ఏడాదికిపైగా ఆయన జైలులో ఉన్నారు. బెయిల్‌పై వచ్చాక ఆయనకు స్టాలిన్ ప్రభుత్వం ఆయనను మంత్రిగా బాధ్యతలు అప్పగించింది. తాజాగా ఈ కేసు సుప్రీంకోర్టు వరకు చేరడంతో ఆయన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇంతకు ముందు ఈ కేసులో మంగళవారం సైతం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. కుంభకోణంలో 2వేలమందికి పైగా నిందితులుగా పేర్కొంటూ.. బాలాజీకి సంబంధించిన కేసుల విచారణను ఆలస్యం చేయడానికి తమిళనాడు ప్రభుత్వం చేసిన ప్రయత్నంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. మనీలాండరింగ్ కేసులో బెయిల్ మంజూరైన కొద్దిరోజులకే తిరిగి మంత్రిగా నియమించడంపై కోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. గత ఏడాది సెప్టెంబర్ 26న బెయిల్ రాగా.. 29న ఆయన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. స్టాలిన్ కేబినెట్‌లో గతంలో నిర్వహించిన శాఖలనే మళ్లీ కేటాయించారు.

# అప్పటిలోగా పాక్ లింకులేంటో చెప్పాలి

## గౌరవ్ గొగోయ్‌కు హిమంత హెచ్చరిక



**ఇంటర్నెట్‌డెస్క్:** పాకిస్థాన్‌తో లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్ సతీమణికి ఉన్న సన్నిహిత సంబంధాలేమిటని అస్సాం ముఖ్యమంత్రి హిమంతబిశ్వ శర్మ ప్రశ్నించారు. సెప్టెంబర్ 10వ తేదీలోగా ఆ వివరాలను బహిర్గతం చేయకపోతే.. ఆమెపై రాష్ట్రం ప్రస్తుతం జరుపుతున్న దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థకు బదిలీ చేస్తానని హెచ్చరించారు. ఇప్పటికే ఈ విషయంలో లోతైన విచారణ అవసరమని భావించి.. తమ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిందన్నారు. దీనిని ఈ ఏడాది ద్వితీయార్థంలో ఎన్ఐఏకు బదిలీ చేయాలని సూచిస్తానని చెప్పారు. గొగోయ్ సతీమణి ఎలిజిబెత్ కోల్‌బర్న్ పాకిస్థాన్‌ను పలు మార్లు సందర్శించారని భాజపా ఆరోపించింది. అంతేకాదు.. ఆ దేశ జీతం పై పనిచేస్తున్నారంటూ విమర్శించింది. పార్లమెంట్‌లో కూడా ఈ అంశం చర్చకు వచ్చింది. దీనిపై గౌరవ్ కూడా సమాధానం చెబుతూ "ప్రధాని మోదీ పాక్‌కు వెళ్లకముందే ముందే అక్కడికి వెళ్లాను. ఆ విషయాన్ని ఆయన (అమిత్‌షా) ఎందుకు ప్రస్తావిస్తున్నారో తెలియడంలేదు" అని పేర్కొన్నారు. ప్రభుత్వం వైఫల్యాలను దాచిపెడుతోందని పేర్కొన్నారు. ఆ తర్వాత ఆపరేషన్ సిందూర్‌పై మాట్లాడుతూ మన దేశంపై పాక్ కుట్రలను సాగనివ్వకూడదని గౌరవ్ గొగొయ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై సోమవారం సభలో జరిగిన ప్రత్యేక చర్చలో ఆయన మాట్లాడారు. పహల్గాంకు ఉగ్రవాదులు ఎలా రాగలిగారో ప్రభుత్వం చెప్పలేదన్నారు. ఆపరేషన్లో మనం ఎన్ని విమానాలు కోల్పోయాం? సైనిక చర్య నిలిపివేతకు ఎవరి ముందు మోదీ లొంగిపోయారు? పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకునేది ఎప్పుడు?.. అనేవి వివరించాలని డిమాండ్ చేశారు. దేశానికి, సైన్యానికి అనుకూలంగానే తాము మాట్లాడుతున్నామని, శత్రువులుగా మాత్రం తమను పరిగణించవద్దని అన్నారు. ఈ వ్యాఖ్యల తర్వాత హిమంత బిశ్వశర్మ హెచ్చరికలు వెలువడటం గమనార్హం.

### భారత్‌పై 25% సుంకాలు విధించిన ట్రంప్




**ఇంటర్నెట్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై చర్యలకు ఉపక్రమించారు. మన దేశ వస్తువులపై 25శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఆగస్టు 1 నుంచి ఇవి అమల్లోకి రానున్నట్లు చెప్పారు. అమెరికా వస్తువులపై భారత్ ఎక్కువ సుంకాలు విధిస్తోందన్నారు. "భారత్ మిత్రదేశమే అయినా.. సుంకాలు ఎక్కువగా ఉన్నందున వారితో పరిమిత స్థాయిలో వ్యాపారాలు చేస్తున్నాం. ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటి. ఏ దేశంలో లేని విధంగా వాణిజ్యపరంగా అక్కడ అడ్డంకులున్నాయి. రష్యా నుంచి భారీ స్థాయిలో సైనిక ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేస్తోంది. ఉక్రెయిన్‌పై దాడులను ప్రపంచమంతా ఖండిస్తోంది. భారత్, చైనాలు మాత్రం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్నాయి. అందుకే భారత్‌పై 25శాతం సుంకాలు అదనంగా పెనాల్టీ కూడా విధిస్తున్నాం. ఆగస్టు 1 నుంచి అమల్లోకి రానున్నాయి" అని 'ట్రూత్ సోషల్' వేదికగా ప్రకటించారు. ఇటీవల భారత్ సహా పలు దేశాలపై ప్రతీకార సుంకాలు ప్రకటించిన ట్రంప్.. ఆగస్టు 1ని డెడ్‌లైన్‌గా విధించిన విషయం తెలిసిందే. వీటికి సంబంధించి ఏప్రిల్‌లోనే ప్రకటన చేసినప్పటికీ.. చర్చల కోసం వీటి అమలుకు గడువు ఇచ్చారు. ఇక భారత్‌పై సుంకాల విషయంలో ఇటీవల స్కాట్లాండ్ పర్యటన సందర్భంగా మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా భారత్ సుంకాలు విధిస్తోందని, అలా చేయడం తగదన్నారు.

### 'నో హెల్మెట్.. నో పెట్రోల్'




**ఇంటర్నెట్ డెస్క్:** ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల్ని నియంత్రించేందుకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లా యంత్రాంగం కీలక చర్యలకు సిద్ధమైంది. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లేకుండా పెట్రోల్ పంపుల వద్దకు వస్తే.. వారికి ఇంధనం నింపేందుకు అనుమతి నిరాకరించనుంది. ఈ నిర్ణయం ఆగస్టు 1 నుంచే అమలులోకి వస్తుందని అధికారులు బుధవారం వెల్లడించారు. మంగళవారం జరిగిన సమావేశంలో రోడ్డు భద్రతా కమిటీ ఛైర్మన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే ఆదేశాల మేరకు ఈ ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించేలా, కార్లలో ప్రయాణించేవారు సీట్ బెల్టులు పెట్టుకొనేలా ఇండౌర్‌లో ఓ క్యాంపెయిన్ చేపట్టాలని సప్రే ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు ఆగస్టు 1 నుంచి ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌లేకుండా వస్తే పెట్రోల్ బంకుల్లో ఇంధనం నిరాకరించనున్నట్లు ఇండౌర్ జిల్లా మెజిస్ట్రేట్ ఆశిష్ సింగ్ తెలిపారు. ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే.. సంబంధిత పెట్రోల్ బంకులపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఏడాది జైలు శిక్ష లేదా రూ.5వేల జరిమానా లేదా రెండూ ఉండే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ఇండౌర్ రోడ్లపై ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ఇటీవల మధ్యప్రదేశ్ హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఉల్లంఘనులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేసిన నేపథ్యంలో ఇండౌర్ జిల్లా యంత్రాంగం కఠినచర్యలకు ఉపక్రమించింది.

### సింధూ నదిలో పడిపోయిన ఐటీబీపీ బస్సు..



**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లో ఘోర రోడ్డు ప్రమాద ఘటన చోటుచేసుకుంది. ఐటీబీపీ(ఇండో-టిబెటియన్ బోర్డర్ పోలీసులు) ప్రయాణిస్తున్న బస్సు ప్రమాదానికి గురైంది. వర్షాల కారణంగా అదుపు తప్పి సింధూ నదిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో పోలీసు సిబ్బందికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివరాల ప్రకారం.. జమ్ముకశ్మీర్‌లోని గండేర్‌బల్ జిల్లాలో ఐటీబీపీ సిబ్బంది ప్రయాణిస్తున్న బస్సు అదుపు తప్పి సింధూ నదిలో పడిపోయింది. ఈ ప్రమాదం నుంచి సిబ్బంది, బస్సు డ్రైవర్ తప్పించుకున్నారు. అతి కష్టం మీద వారంతా బయటకు వచ్చారు. గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం కారణంగా సింధూ నది నీటిలో బస్సు మునిగిపోయింది. అయితే, భారీ వర్షాల కారణంగా వాహనం అదుపుతప్పినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో సిబ్బందికి సంబంధించిన గన్స్, వస్తువులు నీటిలో కొట్టుకుపోయాయి. ఇప్పటి వరకు మూడు గన్స్‌ను వెతికిపట్టుకున్నట్టు సమాచారం. ఇక, ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

### కాంగ్రెస్ రెండుగా చీలిపోయింది

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజేయంద్ర**



కర్నాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో అంతర్గత కలహాలు రోజురోజుకు పెరుగుతున్నట్లుగా ఊహాగానాలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర చేసిన వ్యాఖ్యలతో ఆ రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్గత కలహాలను ఎదుర్కొంటోందని, పార్టీ రెండు వర్గాలుగా విడిపోయిందన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇప్పుడు ఎమ్మెల్యేల విశ్వాసాన్ని కోల్పోయారని, పార్టీలో భారీ గొడవ జరుగుతోందన్నారు. ఈ దీపావళికి కాంగ్రెస్‌లో పెద్ద ఊహించని ఘటన జరుగుతుందని ఆయన జోస్యం చెప్పారు. మేము ముందు నుంచీ చెబుతున్నామని విజయేంద్ర అన్నారు. మనకు వస్తున్న వార్తలు కాంగ్రెస్ పార్టీలో అంతా బాగాలేదని స్పష్టంగా చెబుతున్నాయన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఆగిపోవచ్చు.. కానీ కాంగ్రెస్ అంతర్గత యుద్ధం ఇప్పుడే మొదలవుతుందన్నారు. అభివృద్ధి పనుల విషయంలో చాలా మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సీఎంపై ఆగ్రహంగా ఉన్నారన్నారు. కొంతమంది ఎమ్మెల్యేలు డీకే శివకుమార్‌ను సీఎంగా చేయాలని కోరుకుంటున్నారని.. మరికొందరు ఏసీసీఐ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కోరుకుంటున్నారన్నారు. కొందరు ఎమ్మెల్యేలు సిద్ధరామయ్యనే కొనసాగాలని అంటున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ నిట్టనిలువునా చీలిపోయిందని.. ఎమ్మెల్యేలను ఒప్పించేందుకు సీఎం తమ ప్రాంతాల్లో రూ.50కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రకటించారని.. అయితే, ఇప్పటి వరకు ఆ నిధులు విడుదల కాలేదన్నారు. గత కొంతకాలంగా కర్నాటక కాంగ్రెస్‌లో సీఎం పీఠం మార్పులు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే.

# గులాబీకి దూరమౌతున్న కేసీఆర్ సహచరులు

-మొదటిపేజీ తరువాయి

ప్రారంభించి టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుండి కేసీఆర్ కు వెన్నంటి ఉన్న నేత. భూపాలపల్లి నియోజకవర్గంలో మంచి పట్టున్న నాయకుడు. 2014 ఎన్నికల్లో భూపాలపల్లి ఎమ్మెల్యేగా గెలిచి స్పీకర్‌గా పనిచేశారు. 2018లో ఆయనకు టికెట్ ఇవ్వని బీఆర్ఎస్ అధినేత తర్వాత ఆయన్ని ఎమ్మెల్సీని చేశారు. చారిని కాదని గండ్ర వెంకటరమణకు టికెట్ ఇచ్చిన బీఆర్ఎస్. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు భూపాలపల్లి టికెట్ ఆశించగా?. కాంగ్రెస్ నుండి వలస వచ్చిన సిట్టింగ్ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి టికెట్ ఇచ్చారు. విద్యార్థుల్లో మంచి పలుకుబడి ఉండి, కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడైన బీసీ నేత మధుసూదనాచారిని ఎప్పటి నుండో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యతిరేకిస్తూ వస్తున్నారని చర్చ జరుగుతోంది. అందులో భాగంగానే భూపాలపల్లి ఎమ్మెల్యే టికెట్ మధుసూదనాచారికి కాకుండా గంటల వెంకటరమణ రెడ్డికి వచ్చేలా చేశారని చారి అనుచరులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు రెండు వర్గాలుగా చేరిపోయిన గులాబీ శ్రేణులు బహిరంగంగా ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకున్నారు. ఇక చారి వర్గం సపోర్ట్ చేయకపోవడంతో కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో గండ్ర వెంకటరమణారెడ్డి చిత్తుగా ఓడిపోయారు. చారికి ఇన్చార్జ్ బాధ్యతలు అప్పగించాలని కోరుతున్న కేడర్. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నాటి నుండి ఎమ్మెల్సీ మధుసూదనా చారి, ఆయన కుమారుడు సిరికొండ ప్రశాంత్ భూపాలపల్లి నియోజకవర్గంలో పర్యటిస్తూ వచ్చే ఎన్నికల నాటికి తమ బలం పెంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై అవినీతి ఆరోపణలు ఉండడం, పార్టీ శ్రేణులను పట్టించుకోకపోవడంతో.. పార్టీ క్యాడర్ మధుసూదనా చారికి తిరిగి ఇన్చార్జ్ బాధ్యతలు అప్పగించాలని కోరుకుంటోందంట. క్యాడర్ అభీష్టం మేరకు నియోజకవర్గంలో తరచూ పర్యటనలు చేస్తూ, ప్రత్యేక కార్యాలయాన్ని మధుసూదనాచారి ప్రారంభించుకున్నారు. నియోజకవర్గంలో బీసీ ప్రభావం ఎక్కువ ఉండడం, మధుసూదనా చారి సైతం బీసీ కావడంతో ద్వితీయ శ్రేణి నాయకుల నుండి చారికి మంచి సపోర్ట్ లభిస్తోందంటున్నారు. భూపాలపల్లి గండ్రదే అని ప్రకటించిన కేటీఆర్. అయితే ఇన్నాళ్లు సైలెంట్ గా ఉన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, భూపాలపల్లి నియోజకవర్గంలో తన ప్రభావం పూర్తిగా తగ్గిపోతుందని గ్రహించి తిరిగి కుట్రలకు తెరలేపారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతుంది. స్థానిక సంస్థలు ముంచుకొస్తున్న వేళ చారి ప్రభావంతో పార్టీ పూర్తిగా? తన చేయి దాటి పోతుంది అని గ్రహించి నియోజకవర్గంలో కేటీఆర్ పర్యటన చేయించినట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. కేటీఆర్ భూపాలపల్లి పర్యటన సందర్భంగా తనని సెగ్మెంట్లో భవిష్యత్తు నాయకుడిగా ప్రకటించాలని గండ్ర ప్రాధేయపడ్డారంట. అందుకే భూపాలపల్లి జిల్లాలోని ముఖ్య కార్యకర్తల సమావేశంలో భూపాలపల్లి నియోజకవర్గం గండ్ర వెంకటరమణ రెడ్డి దే అంటూ కేటీఆర్ ప్రకటన చేశారంట. స్థానిక సంస్థల ఎన్నికల్లో చారి వర్గానికి చెక్ పెట్టే ప్రయత్నాలు. అంతేకాకుండా, మధుసూదనాచారి సేవలు రాష్ట్రస్థాయిలో అవసరం ఉన్నాయం టూ, భూపాలపల్లి నియోజకవర్గంలో మధుసూదనాచారి అవసరం లేదని కేటీఆర్ వ్యూహాత్మకంగా వ్యాఖ్యానించారంట. అయితే ఈ వ్యాఖ్యలపై చారి అనుచరులు భగ్గుమంటున్నారట. అసెంబ్లీ ఎన్నికల ముందు మధుసూదనాచారి కి కాకుండా, అక్రమార్కుడైన గండ్రకు టికెట్ ఇచ్చి, పార్టీ ఓటమికి కేటీఆర్ కారకుడయ్యారని మండిపడుతున్నారట. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల ముందు మధుసూదనా చారిని పక్కకు పెట్టాలని ప్రయత్నం చేస్తే సహించబోమని చారి వద్ద వాపోతున్నారట. త్వరలోనే భూపాలపల్లి నియోజకవర్గంలో పర్యటన చేయాలంటూ చారి అనుచరులు ఆయనపై వత్తిడి తెస్తున్నారంట. కేటీఆర్ తీరు కేసీఆర్‌ను వ్యతిరేకించే విధంగా ఉందని చర్చ. మాజీ ఎమ్మెల్యే గండ్ర, ఎమ్మెల్సీ మధుసూదనా చారి వర్గాలుగా విడిపోయిన బీఆర్ఎస్ శ్రేణులు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారట. మరోవైపు కేటీఆర్ తీరు కేసీఆర్ ను వ్యతిరేకించే విధంగా ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ముందు చారికి రావాల్సిన టికెట్‌ను అడ్డుకుని ఓటమి కారకుడైన కేటీఆర్ మరోసారి అదే తప్పు చేస్తున్నారని చారి అనుచరులు వాపోతున్నారట. మరోవైపు రాజకీయ పండితులు మాత్రం కేసిఆర్ సన్నిహితులను కేటీఆర్ రాజకీయాలను తప్పించే ప్రయత్నం చేస్తున్నారని అభిప్రాయ పడుతున్నారు. కేసీఆర్ సన్నిహితులు రాజకీయంగా పాతుకు పోతే భవిష్యత్తులో తన సోదరి, ఎమ్మెల్సీ కవితకు సపోర్ట్ చేసే అవకాశం ఉందని, అందుకే ముందస్తు వ్యూహంతోనే కేటీఆర్ వ్యవహరిస్తున్నారని పొలిటికల్ సర్కిల్స్ లో టాక్ నడుస్తోంది. కేటీఆర్‌తో తేల్చుకోవడానికి సిద్ధమవుతున్న మధుసూదనా చారి. మొత్తానికి భూపాలపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై మధుసూదనా చారి ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. తానో.. కేటిఆరో తేల్చుకునేందుకు త్వరలోనే భూపాలపల్లి నియోజకవర్గంలో సభలు ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారట. తన వెంట కేసీఆర్ ఉండగా.. కేటీఆర్ కుప్పిగంతులు పనిచేయవని.. త్వరలోనే భూపాలపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని చెప్పినట్లు చారి అనుచరులు స్పష్టం చేస్తున్నారు. మొత్తానికి భూపాలపల్లిలో కేసీఆర్ వర్గం వర్సెస్ కేటీఆర్ వర్గం అన్నట్లు తయారైన బీఆర్ఎస్ రాజకీయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది

# ఫామ్ హౌస్ లో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు మంత్రాంగం

**హైదరాబాద్ :** ప్రస్తుతం రాష్ట్రంలో వేడి వేడిగా జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఫామ్ హౌస్ లో కేసీఆర్ తో కేటీఆర్, హరీష్ రావు కీలక భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా రాజకీయ పరిణామాలపై వీరిమధ్య సుదీర్ఘమైన చర్చ జరుగుతున్నట్లు తెలిసింది. ప్రధానంగా మూడు అంశాలతో పాటు మరికొన్ని అంశాలపై వీరు సుదీర్ఘంగా చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. బీసీ రిజర్వేషన్ కు సంబంధించి పార్టీ ఒక స్పష్టమైన విధానం అవలంభించాలని, వీటికి సంబంధించి ఇదివరకే అన్ని పార్టీలు తమ అనుకూలతను స్పష్టం చేశాయి. బీఆర్ఎస్ మాత్రం రిజర్వేషన్ బిల్లును శాసనసభలో మద్దతు పలికినా, ఒకవేళ బిల్లుకు రాష్ట్రపతి, ఆర్డినెన్స్ పై గవర్నర్ ఆమోదం ముద్ర వేయకున్నా, పార్టీ పరంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీలకు సీట్లు కేటాయిస్తామని కాంగ్రెస్ ప్రకటించిన నేపథ్యంలో, పార్టీ కూడా అదే విధానం అవలంభించకుంటే పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందనే విషయమై చేర్చినట్లు తెలుస్తోంది. అలాగే స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉన్నందున, ఈ ఎన్నికలకు ఏవిధంగా శ్రేణులను సమాయత్తం చేయాలనే విషయంపై చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. కవితను జైలు నుంచి విడిపించేందుకు అవసరమైతే పార్టీని, బీజేపీలో విలీనం చేయాలని అనుకున్నట్లుగా జరుగుతున్న ప్రచారాన్ని ఎలా తిప్పికొట్టడం అనే అంశం చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. తెలంగాణ జాగృతి కార్యక్రమాలతో కవిత దూకుడు ప్రదర్శిస్తున్న ఈ తరుణంలో పార్టీ ఏవిధంగా వ్యవహరించడం, కవిత కార్యకలాపాలతో పార్టీకి ఎంతవరకు



లాభం, నష్టం అనే విషయాలపై కూడా చర్చ జరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. కొన్ని విషయాలపై కవిత పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తున్న తీరు కూడా పార్టీలో చర్చ జరుతున్న సందర్భంగా కేసీఆర్ ఏవిధంగా స్పందించి నిర్ణయాలు తీసుకుంటారో ఈ భేటీలో నిర్ణయం జరుగుతుందని భావిస్తున్నారు. స్థానిక ఎన్నికలకు సంబంధించి కార్యాచరణ రూపొందించేందుకు వీలుగా త్వరలో పార్టీ ప్రధాన నాయకులతో పాటు మండల, జిల్లా స్థాయి నాయకులతో ఒక సమావేశం త్వరలో ఏర్పాటు చేసి, ఎన్నికల సందర్భంగా పార్టీ శ్రేణులకు కేసీఆర్ దశదిశా నిర్దేశం చేసేందుకు తెలంగాణ భవన్ లో ఒక విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చెయ్యాలనే తలంపుతో ఉన్నట్లు తెలిసింది.

# పార్క్‌ను కాపాడిన హైడ్రా

**హైదరాబాద్ :** తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన హైడ్రా వ్యవస్థకు విశేష స్పందన లభిస్తోంది. హైదరాబాద్ మూసాపేటలో ఆక్రమణకు గురైన 2 వేల గజాల పార్కు స్థలాన్ని హైడ్రా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. యాసిన్ అనే వ్యక్తి టెంట్ సామాన్ల దుకాణం పేరుతో పార్కు స్థలాన్ని ఆక్రమించి వ్యాపారం చేస్తుండగా, ఫిర్యాదుల మేరకు హైడ్రా స్పందించి ఆక్రమణలను తొలగించింది. స్థానికులు పార్కును అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. తెలంగాణలో రేవంత్ సర్కార్ తీసుకువచ్చిన హైడ్రా పని తీరుపై ఎక్కడ చూసినా ప్రశంసల వర్షం కురుస్తోంది. హైడ్రా వచ్చిన తర్వత.. తెలంగాణ రాజధాని హైదరాబాద్ లో అక్రమ నిర్మాణాలు చేపట్టేవారు.. ఆక్రమణలకు పాల్పడుతున్న వారు భయంతో ఒణికిపోతున్నారు. ఇక గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాల కబ్జాలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడం ఆలస్యం.. వెంటనే రంగంలోకి దిగి.. ఫిర్యాదు అందిన ప్రాంతానికి వెళ్లి పరిశీలిస్తోంది. అక్రమాలకు పాల్పడుతున్నట్లు నిర్ధారణ అయితే చాలు.. వెంటనే వారి భరతం పడుతోంది. ప్రభుత్వ స్థలాలు, ఆస్తులన పరిరక్షణతో పాటుగా నగరంలోని చెరువుల పరిరక్షణ బాధ్యత కూడా హైడ్రా మీదనే ఉంది. ఈక్రమంలో తాజాగా హైడ్రా మూసాపేటలో 2 వేల గజాల పార్కు స్థలాన్ని అక్రమార్కుల చెర నుంచి కాపాడి.. అందరి ప్రశంసలు పొందుతుంది. ఆ వివరాలు..అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై కొరడా ఝుళిపిస్తోన్న హైడ్రా.. తాజాగా మంగళవారం నాడు.. హైదరాబాద్‌లోని మూసాపేట, ఆంజనేయనగర్‌లో ఉన్న ఆక్రమణలు తొలగించింది. యాసిన్ అనే వ్యక్తి పార్కు స్థలంపై కన్ను వేసి దాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేయసాగాడు. ఈక్రమంలో యాసిన్ రోడ్డుకు



ఒకవైపు టెంట్ సామాన్ల దుకాణం నిర్వహించసాగాడు. ఇక దుకాణానికి ఎదురుగా ఉన్న 2 వేల గజాల పార్కు స్థలంలో టెంట్ సామాన్లు, సౌండ్ సిస్టమ్ మెటీరియల్, జనరేటర్ల రిపేరింగ్ తదితర వ్యాపార కార్యక్రమాలకు వినియోగించేవాడు. దీని గురించి గతంలో జీహెచ్ఎంసీ, పోలీసులకు ఫిర్యాదు చేసిన లాభం లేకపోయింది. ఈక్రమంలో హైడ్రా వ్యవస్థ ఏర్పాటు అయిన తర్వాత.. పార్కు స్థలం ఆక్రమణ గురించి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా బృందం.. ఘటనా స్థలాన్ని పరిశీలించించింది. హుడా లేఔట్ ప్రకారం రెండు వేల గజాలను పార్కు కోసం కేటాయించిన స్థలంగా హైడ్రా అధికారులు నిర్ధారించారు. కబ్జా చేసి నిర్మించిన టెంట్ హౌజ్‌ను హైడ్రా అధికారులు మంగళవారం నాడు కూల్చి వేశారు. గతంలో ఈ పార్కు అభివృద్ధికి రూ. 50 లక్షలు విడుదల చేసింది జీహెచ్ఎంసీ. ఈ మొత్తంతో పార్కు చుట్టూ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వచ్చిన వారిని కబ్జాదారులు అడ్డుకున్నారు. ఈక్రమంలో స్థానికులు ఇటీవల పార్కు కబ్జా గురించి హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా దీని మీద విచారణ చేసి కబ్జాలు తొలగించింది. ఇనుప తీగతో ఫెన్సింగ్ వేసింది. ఈక్రమంలో లే ఔట్ ప్రకారం పార్కును అభివృద్ధి చేయాలంటూ స్థానికుల డిమాండ్ చేస్తున్నారు.

## వాణిజ్య పన్నుల శాఖ దాడులు.. వెలుగులోకి భారీ మోసం



-మొదటిపేజీ తరువాయి

పార్క్, ముప్పిరెడ్డిపల్లి గ్రామాల్లోని తయారీ యూనిట్లలో అధికారులు సోదాలు నిర్వహించారు. సరుకులు తరలించకుండా భారీ విలువ కలిగిన కాపర్ సరుకుల సప్లైకి సంబంధించి పన్ను బిల్లులు జారీ చేసినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ వాహనాలను తెలంగాణ నుంచి మహారాష్ట్రకు పంపించగా.. డాక్యుమెంట్లలో మాత్రం భారీ సరుకుల రవాణా జరిగినట్టు చూపించినట్లు అధికారలు నిర్ధారించారు. మోసపూరిత బిల్లుల మొత్తం విలువ రూ.100 కోట్లకు పైగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ మోసం జాతీయ రహదారి ప్రాధికార సంస్థ ద్వారా అందిన టోల్ గేట్ డేటా విశ్లేషణ ద్వారా వెలుగులోకి వచ్చింది. సంస్థ సుమారు రూ. 33.20 కోట్లు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను నకిలీ లావాదేవీల ద్వారా పొందినట్టు అధికారులు గుర్తించారు. ఖాతా పుస్తకాలు, రిజిస్టర్లు, హార్డ్ డిస్కులు, సీసీటీవీ ఫుటేజ్ తదితర ఆధారాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సంస్థ డైరెక్టర్లు వికాష్ కుమార్ కీషాన్, రజనీష్ కీషాన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయమని హైదరాబాద్ కేంద్రమైన సెంట్రల్ క్రైమ్ స్టేషన్ డీసీపీకి అధికారులు ఫిర్యాదు చేశారు. ఇదే కేసులో మరో సంఘటనలో, చార్మినార్ డివిజన్ మెహదీపట్నం-1 సర్కిల్‌కు చెందిన డీఎస్టీవో మజీద్ హుస్సేన్ మరో మోసాన్ని గుర్తించారు. మోసాలపై దర్యాప్తు చేపట్టినట్లు వాణిజ్య పన్నుల కమిషనర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు.

## ఆగస్టు 4వ తేదీ వరకు కాంగ్రెస్ పాదయాత్ర

-మొదటిపేజీ తరువాయి

నిర్వహించనున్నారు. ఈ ధర్నాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకత్వం, బీసీ సంఘాల నాయకులు పాల్గొననున్నారు. ఆగస్టు 7న రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రత్యేక రైలులో ప్రతీ నియోజకవర్గం నుంచి 50 మంది కాంగ్రెస్ శ్రేణులు ఢిల్లీకి వెళ్లాలని నిర్ణయించారు. ఢిల్లీ పర్యటన అనంతరం తెలంగాణలో యథావిధిగా కాంగ్రెస్ పాదయాత్ర కొనసాగనుంది.

## కాళేశ్వరం కమిషన్ రిపోర్టుతో అసెంబ్లీలో చర్చ..



-మొదటిపేజీ తరువాయి

జస్టిస్ ఘోష్ కమిషన్ గడువును మరో 2, 3 రోజులు రేవంత్ ప్రభుత్వం పెంచే అవకాశాలు ఉన్నాయి. కమిషన్ రిపోర్ట్‌పై అసెంబ్లీలో చర్చించి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌లో ఏయే అంశాలు చేర్చారనే అంశం ఉత్కంఠగా మారింది. కాగా, గత కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరంలో భారీగా అవినీతికి పాల్పడిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సుప్రీమ్ కోర్టు మాజీ జడ్జి పినాకి చంద్ర ఘోష్ కమిషన్‌ను 2024లో రేవంత్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జస్టిస్ ఘోష్ కమిషన్‌తో కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణ జరిపించింది కాంగ్రెస్ ప్రభుత్వం. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పనిచేసిన మంత్రులను, పలువురు కీలక అధికారులను ఈ కమిషన్ విచారణ జరిపింది. ఈ కమిషన్ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, ఈటల రాజేందర్, ఈ ప్రాజెక్ట్‌లో పనిచేసిన అధికారులని క్సూడా విచారించింది. కమిషన్‌కు వారు ఇచ్చిన సమాచారం కూడా కీలకంగా మారింది. అయితే దీనికి తోడు కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో పనిచేసిన పలువురు అధికారుల నివాసాల్లోనూ ఏసీబీ సోదాలు జరిగిన విషయం తెలిసిందే. ఈ తనిఖీల్లో పలు కీలక డాంక్యుమెట్లని ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకుని ప్రభుత్వానికి సమర్పించారు. అయితే రేపటి(గురువారం)తో జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణ పూర్తికానుంది. ఈ కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా రేవంత్ ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

## కొద్ది రోజులు ప్రియుడు.. కొద్ది రోజులు భర్త..!



**వికారాబాద్:** తనను వివాహం చేసుకుంటానని భర్త నుంచి దూరం చేసిన ప్రియుడు ఆ తర్వాత మోసం చేశాడని ఓ యువతి ఆరోపించింది. ఈ విషయమై మంగళవారం తల్లిదండ్రులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని, తనకు న్యాయం చేయాలని కోరింది. వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్ జిల్లా తాండూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ యువతి ఇదే ఊరికి చెందిన మరో యువకుడు ఏడేళ్లుగా ప్రేమించుకున్నారు. వీరి ప్రేమ ఇష్టంలేని యువతి తల్లిదండ్రులు రెండేళ్ల క్రితం ఆమెను కర్ణాటకకు చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించారు. పెళ్లయిన నెల రోజుల తర్వాత సదరు యువతి భర్తకు ఫోన్ చేసిన ప్రియుడు తమ ప్రేమ వ్యవహారాన్ని చెప్పాడు. దీంతో యువతిని ఆమె భర్త వదిలేశాడు. అనంతరం తనను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికిన సదరు వ్యక్తి, కాలయాపన చేస్తూ మోసం చేశాడని యువతి ఆరోపించింది. తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరింది. ఇదిలా ఉండగా యువతి పీఎస్‌కు వచ్చిన మాట వాస్తవమేనని పోలీసులు తెలిపారు. బుధవారం వచ్చి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తామని వెళ్లిపోయారని చెప్పారు.

## సంపాదకీయం

# ధర్మస్థలలో ధర్మం లేదా


ధర్మస్థల. ఇదొక కర్ణాటక తిరుమల. కొండల్లో వెలసిన ఈ మంజునాథ స్వామి ఆలయానికి విశేషమైన చరిత్ర. అలాంటి చారిత్రక ఆధ్యాత్మిక కేంద్రంలో వరుస హత్యలు. అందునా మహిళలు, యువతులు, మైనర్ బాలికలున్నారా? ఒక సఫాయి కార్మికుడు చెబుతున్న సాక్ష్యం ద్వారా అసలేం జరుగుతోంది? ఈ మొత్తం ఉదంతం ద్వారా వెలుగులోకి వస్తోన్న కఠిన వాస్తవాలేంటి?1995- 2014 మధ్య కాలంలో.. తాను తన చేతుల మీదుగా కొన్ని వందలాది శవాలను నేత్రావతీ పరిసర ప్రాంతాల్లో ఖననం చేశానని అంటాడు. ఈ పక్కనే ఉన్న అడవుల్లో కొన్ని మృతదేహాలను దహనం కూడా చేశాననీ చెప్పుకొచ్చాడు. మరి కొన్ని మృతదేహాలను తాను నదిలో పాడేశానని అనడం విన్న పోలీసులకు మొదట అర్ధం కాలేదు. బెళ్తంగడి న్యాయస్థానంలో కూడా వాంగ్మూలం ఇచ్చాడు. దీంతో ఒక్కసారిగా ఈ వార్త రాష్ట్ర వ్యాప్త సంచలనంగా మారింది. సీఎంని కలిసిన సుప్రీం రిటైర్డ్ జడ్జ్. ఇతడిచ్చిన వాంగ్మూలంతో ఒక యూట్యూబర్ వీడియో రూపొందించడంతో.. అది అర మిలియన్ వ్యూస్ పోయింది. దీనిపైనా కేసు బుక్ అయ్యింది. ఆ సరికే అది జనబాహుళ్యంలోకి విస్తృతంగా వెళ్లడంతో.. ఈ కేసు, దాని వివరాలు తీవ్ర ప్రకంపనలు నమోదు చేయడం మొదలైంది. అదెలాగంటే సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి గోపాల గౌడ సీఎం సిద్ధరామయ్యను కలిసి.. ఈ కేసు దర్యాప్తు ముమ్మరం చేయాలని కోరారు. ఇందులో మహిళలు, యువతులు, మైనర్ బాలికలు సైతం ఉండటం గుర్తించిన కర్ణాటక మహిళా కమిషన్ సైతం ప్రభుత్వాన్ని దర్యాప్తు పై ఒత్తిడి చేసింది. ఆలయ ధర్మకర్తలు జైన్లు, శివుడికి వైష్ణవ పూజలు జరిగే ధర్మస్తల. ఈ మాజీ సఫాయి కార్మికుడు చెప్పినదంతా ఎలా నమ్మాలి? కొన్నేళ్ల తరబడి ఎంతో నిష్టాగరిష్టతలతో తులతూగుతున్న ఆలయ ప్రాంతానికి ఇంతటి అప్రదిష్ట మూటగట్టడమా? దానికి తోడు ఈ ఆలయ ప్రాంతం పేరే దర్మస్థల. ఇక్కడ ధర్మ దేవత ధర్మాన్ని నాలుగు పాదాలా నడిపిస్తుందని అంటారు. ఇదొక ఆధ్యాత్మిక త్రివేణీ సంగమం. ఆంధ్రకు వెంకటేశ్వరస్వామి వారు ఎలాగో కర్ణాటకలో మంజునాథ స్వామి వారు అలాగ. ఇక్కడ వంశపారంపర్య ధర్మకర్తగా ఎంపీ వీరేంద్ర హెగ్డే ఉన్నారు. ఈయన ఇక్కడ దాదాపు ఒక సమాంతర న్యాయ వ్యవస్థను నడుపుతారు. ఈ ఆలయం ద్వారా చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్య, వైద్య సేవలు విశేషంగా అందుతాయి. కుటుంబ- వ్యాపార- ఇతర సమస్యలేవైనా వస్తే ఈ ప్రాంతానికే తలపెద్దగా భావించే హెగ్డే దగ్గరకొచ్చి తమ సమస్యలు పరిష్కరించుకుంటారు. ఎన్నో జంటలకు ఎంపీ వీరేంద్ర హెగ్డే ఇచ్చే తాళిబొట్టుతో పెళ్లిళ్లు జరుగుతుంటాయి. ఇక్కడ ధర్మం నాలుగు పాదాలా నడుస్తుందనడానికి ఎన్నెన్నో ఉదాహరణలు. అలాంటి ధర్మస్థల లో వందలాది హత్యలు జరిగాయని తెలియడంతో ప్రపంచమంతా షాకైంది. కంప్లయింట్ చేసిన తల్లిని బెదిరించి పంపిన పోలీసులు. ఇంతకీ ఇతడు చెప్పేదేంటని చూస్తే తన చేజేతులా.. ఎన్నో శవాలకు ఖననం, దహనం నిర్వహించానని అంటాడాయన. అంతే కాదు తనకు ఇష్టం లేకపోయినా ఎందరో మహిళలు, యువతులు, మైనర్లు మృతదేహాలను ఖననం చేశానని చెప్పుకొచ్చారు. 2010లో తానిలాగే ఒక స్కూల్ డ్రెస్ వేసుకున్న మైనర్ బాలిక మృతదేహాన్ని ఖననం చేశానని అంటాడీ మాజీ పారిశుధ్య కార్మికుడు. అంతే కాదు 2003లో అనన్య భట్ అనే ఒక ఎంబీబీఎస్ స్టూడెంట్ తన స్నేహితులతో కలసి ధర్మస్తలకు వచ్చి.. ఆపై కనిపించకుండా పోయింది. ఆ సమయంలో మృతురాలి తల్లి ఫిర్యాదు చేయగా పోలీసులు ఆమెను బెదిరించి పంపారని అంటారు. ఇక 2012లో సౌజన్య అనే మరో యువతి హత్యాచారం కేసు పై కూడా కొంత కాలంగా వివాదం చెలరేగుతోంది. తనకు ప్రాణ హాని ఉందంటోన్న మాజీ పారిశుధ్య కార్మికుడు. ఇంతకీ ఈ సఫాయి కార్మికుడు ఇక్కడి నుంచి ఎందుకెళ్లాడు? ఆ వివరాలేంటని చూస్తే.. 2014లో తన కుటుంబానికి చెందిన మైనర్ బాలికను సైతం ఇలాగే లైంగికంగా వేధించారు. దీంతో తనకు విరక్తి వచ్చి ఇక్కడి నుంచి వెళ్లిపోయానని అంటాడాయన. తనలోని పాపభీతి ఇన్నాళ్లకు నిజం బయటకొచ్చేలా చేసిందని.. తాను గత కొంత కాలంగా అపరాధభావంతో కుమిలిపోతున్నట్టు చెప్పుకొచ్చారీ మాజీ పారిశుధ్య కార్మికుడు. తానీ పని చేస్తున్నప్పటి నుంచి తప్పుగానే భావించాననీ.. అయితే బలవంతానా తన చేత ఈ దుర్మార్గపు పని చేయించారనీ.. లేదంటే చంపేస్తామంటూ బెదిరించేవారని చెబుతాడీ మాజీ సఫాయి కార్మికుడు. తనకు ప్రాణహాని ఉందని కూడా చెబుతాడితను.. ఇక్కడి వంశపారంపర్య పాలనా పరంపర అలాంటిది. అందుకే ఈ ఆలయ ధర్మకర్త వీరేంద్ర హెగ్డేకి రాజ్యసభ్యత్వం ఇచ్చి గౌరవించింది కేంద్ర ప్రభుత్వం. ఆయన ఇది వరకే పద్మ పురస్కారాలతో పాటు ఇంకా ఎన్నో విశేష పురస్కారాలు అందుకున్నారు. ధర్మస్తల అంటే ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో అంతటి అశేష సామాజిక ప్రాధాన్యత ఉంది. కార్యమేదైనా హెగ్గే అనుమతి తీస్కునే స్థానికులు. వీరేంద్ర హెగ్డే వీరికొక ధర్మాధికారి మాత్రమే కాదు. అంతకన్నా మించి. ఆయనకు పరోపకారి అన్నదొక బిరుదు. ఈ ప్రాంత కీర్తి ప్రతిష్టల పతాక.. హెగ్డే కుటుంబం. ఈ ఆలయ చరిత్రతో ఈ జైన కుటుంబ చరిత్ర అంతగా మమేమకమై కనిపిస్తుంది. వీరేంద్ర హెగ్డే కుటుంబం తరతరాలుగా ఇక్కడి స్థానికుల నుంచి నీరాజనాలు అందుకుంటోంది. ఈ ప్రాంత వాసుల ఇంట్లో ఏ శుభకార్యం జరగాలన్నా ఆ మంజునాథుడే తమకు ఆనతిచ్చినట్టుగా హెగ్డే దగ్గరకు వచ్చి అనుమతి తీసుకుని వెళ్తారు. అంతగా ఇక్కడి ఆచార వ్యవహారాలు నడుస్తాయి. వారికేదైనా వివాదం వచ్చినా తీర్చుకోడానికి ఇక్కడికే వస్తుంటారు. గతంలో గ్రామ పెద్దలు, ఊరి పెద్దల పంచాయితీలు- తీర్పులు ఎలా సాగేవో.. ఇప్పటికీ ఇక్కడ అలాగే కొనసాగుతుంటాయి. ధర్మస్థల ఉదంతానికి సంబంధించి 8,842 పోస్టులు. వివిధ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ లో ధర్మస్తల ఉదంతానికి సంబంధించిన 8, 842 లింకులను తొలగించాలని కోర్టు ఆదేశించింది. గతంలో తమ దగ్గర పని చేసినపారిశుధ్య కార్మికుడు చేసిన ఆరోపణలకు సంబంధించిన ఫుటేజీ పూర్తిగా తొలగించాలని, వీటిని డీ- ఇండెక్స్ చేయాలని కోరారు హర్షేంద్ర. అంతే కాదు.. తన పిటిషన్లో ఆయన ఎక్స్, ఫేస్ బుక్, థ్రెడ్ వంటి ప్లాట్ ఫామ్స్ పై పోస్టుల గురించి కూడా ప్రస్తావించారు. ఈ వివాదంపై పలు యూట్యూబ్ చానెళ్లు, సోషల్, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియాలో ప్రచురించడం, ప్రసారం చేయడం, ఫార్వర్డ్ చేయడం అప్ లోడ్ చేయడాన్ని నిషేధిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ధర్మస్థల మిస్టరీ మరణాల వివాదం అయితే ప్రస్తుతం దేశ వ్యాప్తంగా వైరల్. కారణమేంటంటే ధర్మస్తల ధర్మాధికారి వీరేంద్ర హెగ్డే ఒక రాజ్యసభ ఎంపీ. ఇంతటి ప్రశాంత వాతావరణంలోని ఈ ఆధ్యాత్మిక కేంద్రంలో ఇలాంటి మారణకాండ జరగటమేంటి? ఇంతకాలం ఇదెలా గుట్టుగా ఉంది? ఎవరికీ అనుమానం రాలేదు ఎందుకని? నదిలోనూ కొన్ని మృతదేహాలు పడేశానని ఆ పారిశుధ్య కార్మికుడు చెబుతుంటే.. మరి అప్పుడే ఆ మృతదేహాలు ఎక్కడో ఒక చోట తేలి.. కనిపించేవి కదా? ఒకటి రెండు తప్ప .. మరే కేసు కూడా ఇప్పటి వరకూ ఎందుకు వెలుగులోకి రాలేదన్నది షాకింగా ఉంది. ఇటు ప్రభుత్వమే కాదు అటు, హెగ్డే కుటుంబం కూడా దీన్నించి ఎలా బయట పడాలో అర్ధంకాక సతమతమవుతోంది. మరి చూడాలి.. ఈ కేసు ఏ మలుపు తీసుకుంటుందో తేలాల్సి ఉంది.

# ఆసమానాలు అటవీ రేంజర్ల త్యాగాలు



ప్రకృతిని పరిరక్షించేవారు ఆయుధాలతో కాదు... అడవిలో అడుగులు వేసే నిరాహంకార పాదాలతో, వన్య జీవులను కాపాడే మానవతా హృదయాలతో. అలాంటి అటవీ సంరక్షకులు ు రేంజర్లు ు వారి సేవలకు స్మరణార్థంగా ప్రతి సంవత్సరం జూలై 31న ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ రేంజర్ దినోత్సవం జరుపుకుంటారు. ఈ దినోత్సవం వన రక్షకుల త్యాగాలకు, వారు ఎదుర్కొంటున్న సవాళ్లకు గుర్తింపుగా, భద్రతా హక్కులపై చర్చకు వేదికగా నిలుస్తోంది. 1992లో ఏర్పడిన ఇంటర్నేషనల్ రేంజర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2007 నుంచి ఈ దినోత్సవం నిర్వహించ బడుతోంది. ఇదే తేదీన 1992లో విధిలో ప్రాణాలు కోల్పోయిన యుగాండా రేంజర్‌కు స్మారకంగా జూలై 31ను ఎంచుకున్నారు. అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా 100కి పైగా దేశాల్లో ఈ దినోత్సవం నిర్వహిస్తున్నారు. రేంజర్ పదవిని మామూలుగా అటవీ భద్రతా ఉద్యోగిగా భావించినా... వాస్తవానికి వీరు పర్యావరణ పరిరక్షణకు, జీవవైవిధ్య సంరక్షణకు ముందు వరుసలో నిలిచే యోధులు. వారివల్లే మన అడవులు, వన్య ప్రాణులు, ప్రకృతి వనరులు కాపాడ బడతాయి. వీరు వేటగాళ్లు, అక్రమ కలప స్మగ్లర్లు, అడవిని ఆక్రమించే వారితో రోజూ పోరాడాల్సి వస్తోంది. దట్టమైన అడవులు, కఠిన వాతావరణ పరిస్థితులు, హింసాత్మక ఘటనలు వీరి పని భాగమై పోయాయి. కానీ వీరికి సరైన మౌలిక వసతులు, రక్షణా పరికరాలు, శిక్షణలు చాలా చోట్ల లేవు. ఇలాంటి పరిస్థితుల్లోనూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతున్నారు. గత 15 ఏళ్లలో ప్రపంచ వ్యాప్తంగా 1,700 మందికి పైగా వన రక్షకులు విధుల్లో ప్రాణాలు కోల్పోయారు. 2023లో ఒక్క ఏడాది లోనే 137 మంది రేంజర్లు మరణించారు, వీరిలో 46 మంది హత్యలు, 22 మంది వాతావరణ ప్రమాదాలు, 19 మంది వన్యప్రాణుల దాడుల్లో ప్రాణాలు విడిచారు. ప్రస్తుతం 105కి పైగా దేశాల్లో 2 లక్షల మంది వన రక్షకులు విధుల్లో ఉన్నారు. వారి ప్రాణాలకు గౌరవంగా పనిచేస్తున్న థిన్ గ్రీన్ లైన్ ఫౌండేషన్ వంటి సంస్థలు వీరి కుటుంబాలకు సహాయ పడుతున్నాయి. భారత దేశం మొత్తం 7,13,789 చదరపు కిలోమీటర్ల అటవీ భూమిని కలిగి ఉండగా, దాదాపు 2.5 లక్షల మంది అటవీ ఉద్యోగులు ఈ విభాగంలో ఉన్నారు. వీరిలో రేంజర్లు, బీట్ గార్డులు, వన్య జీవ పరిరక్షణ అధికారులు ముఖ్యులు. గడచిన 20 ఏళ్లలో 250 మందికి పైగా భారత రేంజర్లు విధుల్లో ప్రాణాలు కోల్పోయారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జారండ్, నాగలాండ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో వన రక్షకులు మావోయిస్టు దాడులు, అక్రమ వేటగాళ్ల హింసను ఎదుర్కొన్నారు. 2019లో ఛత్తీస్ గఢ్‌లో ఓ రేంజర్ మావోయిస్టుల పేలుడు బాంబులో మరణించాడు. 2021లో మాధవరావ్ నేషనల్ పార్క్‌లో ఒక జింకను రక్షించేందుకు ప్రయత్నిస్తూ ఓ రేంజర్ మరణించాడు. 2023లో ఒడిశాలోని సింహాచలం అడవిలో అక్రమ వేట నుంచి ప్రాణులను రక్షిస్తూ ఒక మహిళా రేంజర్ ప్రాణాలు కోల్పోయింది. 2024లో తెలంగాణలోని కౌన్సర్ ఫారెస్ట్ రిజర్వులో అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్నందుకు వన రక్షకులపై సామూహిక దాడి జరిగింది. ఈ నేపథ్యంలో రేంజర్లకు ఎదురయ్యే ప్రధాన సవాళ్లు: ఆధునిక టెక్నాలజీ లేమి ుూ, డ్రోన్లు, నైట్ విజన్ పరికరాలు లేవు. భద్రతా దుస్తులు, ఆయుధాల లేమి. అల్ప వేతనాలు, రాత్రిపూట పని, మానసిక ఒత్తిడికి గురయ్యే పరిస్థితులు. విధుల్లో గాయపడినా మెరుగైన వైద్యం లేకపోవడం. మరణించిన తర్వాత కుటుంబాలకు సరైన న్యాయం, పరిహారం ఆలస్యంగా రావడం.ఈ నేపథ్యంలో కేంద్ర వనశాఖ, విధుల్లో మరణించిన రేంజర్లకు రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలన్న ప్రతిపాదన చేసింది. రాష్ట్రాల స్థాయిలో కూడా రేంజర్లకు విశ్రాంతి వసతులు, ఆరోగ్య శిబిరాలు, రక్షణా పరికరాలు, శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వన రక్షకులను సైనికుల్లా గౌరవించాలి. వన యోధుడు పురస్కారం వంటి అవార్డులు ఇవ్వాలి.అటవీ సంరక్షణలో సమాజం భాగస్వామ్యంగా మారాలి. పాఠశాల స్థాయిలో నుంచే వన్యజీవ సంరక్షణపై అవగాహన కల్పించాలి. పర్యాటకులు అటవీ నియమాలను గౌరవించాలి. పౌర సమాజం రేంజర్లకు మద్దతుగా నిలవాలి. ప్రపంచ రేంజర్ దినోత్సవం అంటే కేవలం స్మరణ మాత్రమే కాదు... అది ఒక బాధ్యత. మనకు ఊపిరినిచ్చే అడవులను కాపాడే వారి పోరాటాన్ని గౌరవించాల్సిన బాధ్యత. వారు మాట్లాడే వారు కాదు, ప్రకృతికి స్వరమిచ్చే వారు. అటువంటి వనరక్షకులకు మన హృదయ పూర్వక వందనం.

# అలనాటి మేటి గాయకుడు రఫీ



హిందీ సినిమా రంగం 1950 నుండి 1970 కాలం మహమ్మద్ రఫీ యుగం అంటే అతిశయోక్తి గాదు. ఆయన ఉత్తర భారత ప్రముఖ నేపథ్య గాయకుడు. హిందీ సినీ చిత్ర సీమలో ఒకనాడు మకుటం లేని మహారాజుగా వెలిగాడు. కేవలం రఫీ పాటలతో వందల కొద్దీ చిత్రాలు విజయం పొందాయనేది నూటికి నూరుపాళ్లు నిజం. తన గాన మాధుర్యంతో ప్రేక్షకులను అలరించిన మహ్మద్ రఫీ 24 డిసెంబర్ 1924 పంజాబ్ లోని అమృత్ సర్ లో జన్మించాడు. బాల్యంలో తమ గ్రామానికి వచ్చే ఫకీర్ల గానాన్ని రఫీ అనుకరించే వాడు. అలా చిన్నప్పుడే సంగీతంతో మక్కువ ఏర్పడింది. ఆ క్రమంలోనే ఉస్తాద్ బడే గులామ్ అలీ ఖాన్ వద్ద రఫీ సంగీత శిక్షణలో రాటు దేలాడు. అలా సినిమాల్లో పాటలు పాడడానికి 1944లో బొంబాయి వెళ్లాడు. 'గావ్ కీ గోరి' అనే హిందీ చిత్రంలో జి.ఎం.దురానీ తో కలిసి రఫీకి మొదటిసారి పాడే అవకాశం వచ్చింది. రఫీ పాడిన తొలి హిందీ గీతమిది. ఆ తర్వాత 1948లో గాంధీజీ హత్య జరిగినపుడు రఫీ 'సునో సునో ఏ దునియావాలో బాపూజీకి అమర్ కహానీ' పాటతో పాపులర్ అయ్యాడు. ఈ పాటకు భారత ప్రధాని నెహ్రూ చేతుల మీదుగా సిల్వర్ మెడల్ అందుకున్నాడు. హిందీ సినిమా గాన జగత్తులో 1950 నుండి 1970 కాలం నిజంగా మహమ్మద్ రఫీ యుగం. రఫీ హిందీ, ఉర్దూ, మరాఠీ, తెలుగు భాషలలో పాటలు పాడాడు. 17 భాషలలో తన గానంతో అందరినీ అబ్బుర పరచాడు. రఫీ, లతా మంగేష్కర్ ల గాయక జోడీ, హిందీ నేపథ్య గాన చరిత్రలో కొత్త ఒరవడిని, రికార్డును సృష్టించింది. మహ్మద్ రఫీని వరించిన అవార్డులకు లెక్కేలేదు. కేంద్ర ప్రభుత్వంచే పద్మశ్రీ పురస్కారం, జాతీయ స్థాయిలో ఉత్తమ గాయకుడిగా అవార్డుతో పాటు పలు ఫిల్మ్ ఫేర్ అవార్డులు ఆయన్ని వరించాయి. హిందీతో పాటు 17 భారతీయ భాషల్లో 20వేలకు పైగా పాటలు పాడాడు. తొలితరం భారతీయ సినీ సంగీత సాగర ప్రయాణానికి దిక్సూచి లాంటి వాడు రఫీ. పృథ్వీరాజ్ కపూర్, రాజ్ కపూర్, రిషీ కపూర్ వంటి మూడు తరాల బాలీవుడ్ నటులకు స్వరాలు అందించిన ఘనత రఫీ సొంతం. తెలుగు విషయానికొస్తే...తండ్రి ఎన్టీఆర్, కొడుకు బాలకృష్ణకు ప్లేబ్యాక్ అందించారు రఫీ. నౌషాద్ కోసం రఫీ మొత్తం 149 పాటలు, బర్మన్‌తో కలిసి 37 చిత్రాలలో పని చేశాడు, శంకర్ - జైకిషన్ కోసం రఫీ మొత్తం 341 సంఖ్యలను (216 సోలో) పాడారు. కల్యాంజీ ఆనంద్జీ రఫీ స్వరంలో సుమారు 170 పాటలు కంపోజ్ చేశారు. రవితో , మదన్ మోహన్‌తో , ఓ.పీ.నయ్యర్‌తో, లక్ష్మీకాంత్ - ప్యారేలాల్‌తో, రోషన్, జైదేవ్, ఖయ్యామ్, రాజేష్ రోషన్, రవీంద్ర జైన్, బాపి లాహిరి, సపన్ జగ్మోహన్ వంటి సంగీత దర్శకులందరికీ తరచూ పాడారు. ఉషా ఖన్నా , సోనిక్ ఒమి , చిత్రగుప్తా , ఎస్ఎన్ త్రిపాఠి , ఎన్. దత్తా మరియు ఆర్.డి బర్మన్ లాంటి సంగీత దర్శకులతో పని చేశాడు. అనేక ప్రైవేట్ ఆల్బమ్‌లను వివిధ శైలులు మరియు భాషలలో రికార్డ్ చేశాడు. గిన్నీస్ రికార్డు ప్రకారం భారతీయ భాషలలో 28,000 పాటలను రికార్డ్ చేసినట్లు పేర్కొన్నారు. రఫీ రెండు సినిమాల్లో నటించాడు. లైలా మజ్ను (1945) చిత్రంలో "తేరా జల్వా జిస్ నే దేఖా" మరియు జుగ్ను (1947) చిత్రంలో "వో అప్ని యాద్ దిలాన్ కో" పాటల కోసం తెరపై కనిపించాడు. 1948 - స్వతంత్ర భారత మొదటి సాంవత్సరిక ఉత్సవాలలో రజత పతాకాన్ని జవహర్ లాల్ నెహ్రూ చేతుల ద్వారా ప్రదానం చేయ బడింది. 1967 - భారత ప్రభుత్వంచే పద్మశ్రీ బిరుదు ప్రదానం చేయ బడింది. 2001 - హీరో హోండా, స్టార్ డస్ట్ మేగజైన్ లద్వారా "బెస్ట్ సింగర్ ఆఫ్ ద మిలీనియం గౌరవ ప్రదానం. 2013 - సి ఎన్ ఎన్.. ఐ బి ఎన్ పోల్ లో గ్రేటెస్ట్ వాయిస్ ఇన్ హిందీ సినిమాగా ఎన్నికయ్యాడు. "చౌధవీం కా చాంద్ హో" , "తేరి ప్యారీ ప్యారీ సూరత్ కో", "చాహూంగా మై తుఝే సాంఝ్ సవేరే", "బహారో ఫూల్ బర్సావో", "మై గావూ తుమ్ సోజావో", "ఖిలోనా జాన్ కర్", "క్యా హువా తేరా వాదా", ఇలా ఒక్కటేమిటి, రఫీ పాడిన ఎన్నో పాటలు చిరస్థాయిగా నిలిచిపోయే జ్ఞాపకాలుగా మిగిలి పోయాయి. తెలుగులో ఆయన పాడిన ప్రతి పాట ఆణిముత్యమే. 'భలే తమ్ముడు' చిత్రంలోని "ఎంతవారు కానీ వేదాంతులైనా కానీ", ఎన్టీఆర్ 'ఆరాధన'లో "నా మది నిన్ను పిలిచింది గానమై".. 'అక్బర్ సలీం అనార్కలి'లో ఆయన పాడిన "సిపాయి" పాట నేటికీ తెలుగు ప్రేక్షకుల్లో మనసుల్లో అలాగే నిలిచి వుంది. 1980 జూలై 31న శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. ఆయన ఈ లోకాన్ని వదిలి వెళ్లి దాదాపు 40 ఏళ్లు దాటినా ఆయన స్వరం ప్రతిగుండెలో ప్రతిధ్వనిస్తూనే ఉంది. అందుకే భారతీయ సినీ సంగీత ప్రపంచంలో రఫీ అమర గాయకుడిగా నిలిచి పోయాడు.

## భవిష్యత్ తరాలకు మార్గదర్శకులు

తెలుగు సాహిత్య, పత్రికా రంగంలో నిండుగా రసదాయకంగా దశాబ్దాల పాటు విస్తరించిన పేరు నండూరి పార్థసారథి. వ్యంగ్యం, హాస్యం, విమర్శ, సంగీతం, చలనచిత్రం వంటి అనేక కళా విభాగాలపై లోతైన చింతనతో రచన చేసి పాఠకులకు కొత్త పోకడలను చూపించిన అరుదైన రచయిత. 1939, జూలై 31న కృష్ణాజిల్లా, బాపులపాడు మండలం, ఆరుగొలను గ్రామంలో జన్మించిన ఆయన, 2024 జూన్ 14న హైదరాబాదులో పరమపదించగా, తన రచనల ద్వారా చిరంజీవిగా నిలిచిపోయారు. విజయవాడలో ఇంటర్మీడియట్ చదివిన ఆయన, హైదరాబాద్‌లో బి.ఏ. పూర్తిచేసి, తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. పూర్తి చేశారు. విద్యార్హత మాత్రమే కాదు, అభిరుచి, పాండిత్యం కలగలిసిన భావదృష్టితో 1959లో "ఆంధ్రప్రభ" పత్రికలో పాత్రికేయుడిగా ప్రస్థానం మొదలుపెట్టారు. తరువాత ఏకకాలంలో శార్వరి, విద్వాన్ విశ్వం, గొల్లపూడి మారుతీరావుల వంటి సాహిత్య వేత్తలతో కలిసి పనిచేశారు. ఆయన రచనా నైపుణ్యం, సామాజిక పరిపక్వత, వ్యవస్థలపై వాడిగా బాణాలు ఎక్కు పెట్ట గలిగిన ధైర్యం ఆయనను పత్రికా రంగంలో విశిష్టంగా నిలబెట్టాయి. పార్థసారథి రచనలు మొదటిగా 1957లో ప్రచురితమవ్వగా, తరువాత 'రాంబాబు డైరీ' (మూడు భాగాలు), 'పిబరే హ్యూమరసం', 'అయోమయ రాజ్యం', 'సాహిత్య హింసావలో కనం', 'ఖారానాఖ్యానము', 'జేజి మావయ్య పాటలు' వంటి హాస్య రచనలతో తెలుగు పాఠకులను నవ్విస్తూ ఆలోచింపజేసే శైలిని ఏర్పరచుకున్నారు. ఆయన రచనలు కేవలం వినోదం కోసం గాక, సంఘాన్ని ప్రశ్నించే, అలసిన మానవ సమాజాన్ని చైతన్యపరచే రీతిలో సాగతీత చేశాయి. ఆయన వ్యాసాలు, సమీక్షలు, సంగీతంపై రచనలు హిందుస్తానీ సంగీతం పై నిశిత అవగాహనను చాటాయి. "స్వరార్ణవం", "సంగీత కళా చరిత్ర", "శ్రీకృష్ణ కథామృతం" వంటి రచనలు సంగీతారాధకులను ఆకట్టుకున్నాయి. నాటక, శిల్ప, చిత్రకళలపై కూడా వ్యాసాలు రాశారు. 2000 అక్టోబరులో దీపావళి సందర్భంగా ఆయన ప్రారంభించిన 'రసమయి' మాసపత్రిక (95 సంచికలు) ఒక సాంస్కృతిక వేదికగా నిలిచి, నాటకీయ సమీక్షలు, కళా విశ్లేషణలు, సంప్రదాయ-నవీన విలయ రూపంగా పాఠకులకు వినూత్న అనుభ వాన్ని అందించింది. సంపూర్ణంగా స్వంత ఖర్చుతో, సాహిత్యాన్ని సేవా ధర్మంగా భావించిన తపస్విగా ఆయన దీనిని నిర్వహించారు.తెలుగు విశ్వవిద్యాలయం 1992లో హాస్య రచనకు, 2002లో పాత్రికేయ సేవలకు ఆయనకు పురస్కారాలు అందించింది.

# బెల్లంపల్లి సమస్యలపై మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం

## త్రాగుటకు స్వచ్ఛమైన నీరు సీజన్ వ్యాధులనుండి బెల్లంపల్లి ప్రజలకు రక్షించాలి..

టిడిపి టియుసి ప్రధాన కార్యదర్శి టి.మణిరామ్ సింగ్







**బెల్లంపల్లి,జులై30(సూర్యరేఖ)** బెల్లంపల్లిలోని 34 వార్డులలో వడ ప్రాజెక్టు నుంచి నిత్యం వార్డులలో త్రాగునీరు సరఫర చేస్తున్నారు.అక్కడి నుండి బెల్లంపల్లి మున్సిపాలిటీకి అపరి శుభ్రమైన మురికి నాచు,ఎర్ర రంగులో వచ్చిన నీటిని ఫిల్టర్ చేయకుండా బ్లీచింగ్ పౌడర్ అలాగే నీటిని సరఫరా చేయడం వలన పట్టణ ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు టి.మణిరామ్ సింగ్ మున్సిపల్ కమిషనర్ కు తెలిపారు.అలాగే బెల్లంపల్లిలో ప్రతి బస్తీలో కుక్కలు,కోతులు పట్టణంలో నిత్యం ఏదో ఒక బస్తీలో ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. సీజనల్ వ్యాధులు,దోమల బెడద మలేరియా,విష జ్వరాలు నుండి పేద ప్రజలు ప్రైవేట్ హాస్పిటల్లో చేరుతున్నారని తెలిపారు.పేద ప్రజలు వేలకు వేల రూపాయలు ట్రీట్మెంట్ కు చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు. డబ్బులు ఖర్చు చేసి ట్రీట్మెంట్ చేసుకోలేని పరిస్థితులు కూడా ఉన్నాయి.సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున బస్తీ,వార్డులలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని, బస్తీ వార్డులలో తడి,పొడి చెత్త,బ్లీచింగ్ పౌడర్ దోమల మందు పిచికారి చేయించాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.అలాగే బెల్లంపల్లి నియోజకవర్గంలోని అన్ని మున్సిపాలిటీ, గ్రామపంచాయతీలో కూడా ప్రజలు అనారోగ్యం పాలు కాకుండా మున్సిపల్ కమిషనర్,గ్రామ అధికారులు ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని కోరారు.అలాగే కోతులు,కుక్కల బెడద వలన ప్రజలకు రక్షణ కల్పించాలని,పిచ్చి మొక్కలు, పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గా చూసుకోవలసిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉన్నదని తెలిపారు.ఇట్టి విషయముపై స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేకమైన దృష్టి సాధించాలని బెల్లంపల్లి టిడిపి పట్టణ అధ్యక్షులు టి మణిరామ్ సింగ్ కోరారు. అధికారులు వెంటనే స్పందించి గోదావరి నుండి బెల్లంపల్లికి స్వచ్ఛమైన పరిశుభ్రమైన తాగునీటిని బెల్లంపల్లి పట్టణ ప్రజలకు సరఫరా చేసే విధంగా వెంటనే స్పందించి చొరవ తీసుకోవాలని, లేనియెడల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఆవరణలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు బొల్లు మల్లయ్య,పట్టణ ఉపాధ్యక్షులు ఆర్.గంగాధర్ గౌడ్ గైన తిరుపతి మేకల రాజయ్య,కన్నూరి శ్రీనివాస్, ఎండి. సుభాన్ మోసాడి గోపాల్ పులిపాక రాములు, బి.సత్యనారాయణ ఎండి. అస్గర్ భాష,తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం..

ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ మోహన్ నాయక్



**నిజాంపేట,జూలై30(సూర్యరేఖ)** మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన సయ్యద్ అబ్దుల్,అనారోగ్యంతో మరణించడం జరిగింది.అలాగే అదే గ్రామానికి చెందిన విద్యార్థి మదిహ మనస్థాపంతో ఉరివేసుకొని మరణించడం జరిగింది.బుధవారం ప్రముఖ సంఘ సేవకులు కాంగ్రెస్ పార్టీ నాయకుడు లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ బాధిత కుటుంబాలను పరామర్శించి ఒక్కొక్కరి రూ.5వేలు,మరొకరికి రూ.5వేలతో పాటు 25 కేజీల బియ్యాన్ని అందించారు.అలాగే నిజాంపేటకు చెందిన ఆనరాశి పోచయ్య గుండెపోటుతో మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలను అందించారు.నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న డాక్టర్ మోహన్ నాయక్,కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్ పట్టణ అధ్యక్షుడు కొమ్మట బాబు,నసీరుద్దీన్,పంజా మహేందర్ యూత్ అధ్యక్షులు రామచందర్ నాయక్,సామల మహేష్,జెల్లా లక్ష్మణ్ గౌడ్ రాజునాయక్ బాలకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## వధువు వివాహనికి పుస్తె మట్టెలను వితరణ..



**నిజాంపేట,జూలై30(సూర్యరేఖ)** మండల పరిధిలోని బచ్చురాజుపల్లి గ్రామానికి చెందిన రమావత్ వీణలోక్య,ల కుమార్తె మాధురి వివాహానికి బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్,హాజరై పూస్తే మట్టేలను అందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్,మండల యూత్ అధ్యక్షుడు రామ్ చందర్ నాయక్,నాయకుడు శ్రీనివాస్ జీవన్ నరేందర్ విట్టల్ సురేందర్ పర్శ,రాజు, తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటేషన్ నిలిపివేయాలి..

అదనపు కలెక్టర్ కు గ్రామస్తుల వినతి.



**నిజాంపేట,జూలై30(సూర్యరేఖ)**మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు టీచర్లను డిప్యూటేషన్ పై వేరే పాఠశాలకు పంపించవద్దని గ్రామస్తులు మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ కు బుధవారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో 55 మంది విద్యార్థులు ఉండగా నలుగురు టీచర్ల తో విద్య బోధన అందిస్తున్నామని ఇద్దరు టీచర్లను పంపిస్తే తమ పిల్లల భవిష్యత్తు ఇబ్బందిగా మారుతుందని డిప్యూటేషన్ వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వడ్ల ప్రవీణ్ కుమార్,సౌడ స్వామి, కోమిడిరాజు,జీవన్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట

ఇన్చార్జిమంత్రికి ఘన స్వాగతం..



**కామారెడ్డి,జూలై 30(సూర్యరేఖ)** మహిళ సాదికారత కు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కఅన్నారు. బుధవారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి,రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఓ కార్యక్రమానికి కామారెడ్డికి హాజరయ్యారు. కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి రవి ప్రసాద్,కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాళ్లతో కలిసి శాలువా కప్పి పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు అనంతరం మంత్రి మాట్లాడుతూ. మహిళల సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని వడ్డీ లేని రుణాలు,మహిళా శక్తి భవనాలు అంగన్వాడి భవనాలు ప్రమాద బీమా,తదితల ప్రయోజనాల గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తూ మహిళలందరూ స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా చేరేలా ప్రోత్సహించాలని ఆమె మహిళా నాయకురాలకు దిశా నిర్దేశం చేశారు.సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర అమోఘమైందన్నారు. ప్రస్తుత తరుణంలో కుటుంబం నుంచి మొదలుపెడితే దేశ నిర్మాణం వరకు ప్రతి రంగంలో మహిళా శక్తి సత్తా చాటుతుందన్నారు.

## కాంగ్రెస్ పాలనలోపేదల పదేళ్ల కల సాకారం

జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగరాజ్ గౌడ్



**కామారెడ్డి,జూలై 30(సూర్యరేఖ)** తెలంగాణలో పదేళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేదల కలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నెరవేర్చిందని జిల్లా కాంగ్రెస్ నాయకులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గత ప్రభుత్వం పదేళ్లుగా రేషన్ కార్డులు మంజూరు చేయక,రేషన్ కార్డులలో చేరికలకు అవకాశం కల్పించక ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే ప్రజాపాలనలో పేదల రేషన్ కార్డుల కల నెరవేర్చడమే కాకుండా కుటుంబసభ్యుల చేరికలకు అవకాశం కల్పించిందన్నారు.సన్న బియ్యం పంపిణీ కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించి ఆహారభద్రత కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి 6కిలోల చొప్పున దేశంలో ఎక్కడ లేని విధంగా సన్న బియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. మంగళవారం రేషన్ కార్డుల పంపిణీకి దోమకొండకు విచ్చేసిన జిల్లా ఇంఛార్జి మంత్రి సీతక్కకు,ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీలకు మహిళ లబ్ధిదారులు ఘన స్వాగతం పలికారని పదేళ్ల కల కాంగ్రెస్ సాకారం చేసిందనడానికి ఇదే నిదర్శనమన్నారు.నూతనంగా రేషన్ కార్డుల పొందిన లబ్ధిదారులకు ఆరోగ్య శ్రీసేవలు కూడా అందుతాయని పేదల పదేళ్ల కల సాకారం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రివర్గానికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీకి,టీ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,లకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన మల్లాపూర్ ఎస్సి బస్తి వాసులు





మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయికిరణ్ గౌడ్

**ఉప్పల్,జూలై 30(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వ రెడ్డి సహకారంతో నిధులు మల్లాపూర్ డివిజన్ ఎస్సీ బస్తీ ఈ రోడ్ల నిర్మాణం కోసం రూ.74 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. బుధవారం మల్లాపూర్ డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరైన నేపథ్యంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయికిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం,స్వీట్స్ పంచడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, దంతురి రాజుగౌడ్ పీజీ. సుదర్శన్ బెల్లం గట్టయ్య, నెమలి అనిల్, కోయగూర బాలరాజ్,మక్తల బాలరాజ్,జెమిలా భేగం సురేష్ పసియుద్దీన్, మనోహర్,ఎస్ వి.కి ట్టు జానీభాయ్ జోష్,శ్రీనివాస్, రాజేష్ పర్వతాలు మల్లు భాయ్ సతీష్,ఉపేందర్ రెడ్డి,కయూమ్ ఫిరోజ్, శైలజ సోనీ ఇర్షెత్ భాను, శ్రావణి గౌడ్, నాజమా సునీత మైథిల్ శ్రీను బస్తీ వాసులు పాల్గొన్నారు.

# మద్నూర్ మండలంలో జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఆకస్మిక పర్యటన





**కామారెడ్డి,జూలై 30,(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం మద్నూర్ మండలంలో పర్యటించి పలు అభివృద్ధి, పర్యవేక్షణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.పర్యటనలో భాగంగా మద్నూర్ గ్రామంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్ సి)ని సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై నేరుగా రోగులు మరియు వైద్య సిబ్బందితో మాట్లాడి సమాచారం పొందారు.వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందించాలని, సాధారణ మందులతోపాటు పాముకాటు మరియు ఇతర అత్యవసర మందులు కూడా ఎప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ సానిటేషన్ పనులు నిరంతరం చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. తదుపరి హండీ కీలూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి,100 శాతం మార్కింగ్ అవుట్‌లు చేయాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుక కొరత రాకుండా నిరంతరం పర్యవేక్షణ చేసి ఇండ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేసుకునేలా లబ్ధిదారులకు సహకరించాలని ఎంపీడీవోను ఆదేశించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షించి లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఇసుక మరియు మొరం సరఫరాకు ఏమైనా ఇబ్బంది కలిగితే వెంటనే ఎంపీడీవోకు మరియు తాసిల్దార్ కు తెలియజేసి సమస్య పరిష్కరించాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా గ్రామ పంచాయతీలలో ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించి త్రాగునీటిని క్లోరినేషన్ చేయాలని డ్రైనేజీలలో నీరు నిలువ ఉండకుండా పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.తదుపరి పెద్ద ఎక్లారా గ్రామంలోని గురుకుల పాఠశాలను సందర్శించి,విద్యార్థులతో కలిసి వన మహోత్సవం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటి ప్రతి ఒక్క విద్యార్థి మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినిలతో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు.

## మల్లాపూర్ కు మరొకసారి నిధులను విడుదల చేసిన రేవంత్ సర్కార్





**హర్షం వ్యక్తం చేసిన మల్లాపూర్ డివిజన్ ప్రజలు**

**ఉప్పల్,జూలై 30(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వ రెడ్డి సహకారంతో మల్లాపూర్ డివిజన్ లోని స్వామి వివేకానందనగర్ కాలనీ,ఎస్సి.బస్తీ,ఓల్డ్ మల్లాపూర్ ప్రాంతాలకు సీసీ రోడ్ల పనుల నిమిత్తం రూ.74లక్షలు నిధులు విడుదలయ్యాయి. ఈ సందర్భంగా గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఎస్సీ బస్తీ వాసులు కాంగ్రెస్ నాయకులు,మహిళా నాయకురాళుకార్యకర్తలు పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మల్లాపూర్ డివిజన్లో కనివిని ఎరగని రీతిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పీజీ.సుదర్శన్ బాలరాజ్‌గౌడ్ కె.రాజేష్ వి.శ్రీనివాస్ కె.సాయికిరణ్ గౌడ్ జమీలా వి.జోష్ గట్టయ్య మని



పర్వతాలు మల్లు సతీష్ కె.సురేష్ గౌడ్ రింకు నజ్మా శ్రావణి ఇష్రాత్ బాను పాల్గొన్నారు.

## రామాంతపూర్ శ్రీరామణపురం స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.98లక్షల నిధులు మంజూరు

**కాలనీ ప్రతినిధులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేసిన ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి**



**ఉప్పల్,జూలై 30 (సూర్యరేఖ)** రామంతాపూర్ శ్రీరమణపురంలో హెచ్ పి.గోడౌన్ నుండి ఇరిగేషన్ నాలా వరకు స్ట్రోమ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణానికి రూ 98 లక్షల నిధులు మంజూరు అయ్యాయి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఈపటికె ఉప్పల్ డివిజన్ కు భారీగా నిధులు మంజూరు చేయించినట్టుగా ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి,ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తున్నట్టుగా చెప్పారు.అందులో భాగంగానే రామంతాపూర్ శ్రీరామణపురంలోని స్టమ్ వాటర్ డ్రైనేజీకు సైతం నిధుల కేటాయింపు జరిగిందన్నారు.కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు రజితపరమేశ్వర్ రెడ్డి నిధుల మంజూరుకు సంబంధించిన ప్రోసిడింగ్ పత్రాలను అందజేశారు.ఇదే తరహాలో ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులను చేపట్టినట్టుగా తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీరామణపురంకాలనీ వాసులు పి. రాఘవేందర్ లుకాస్,సత్తిరెడ్డి,పోలిశెట్టి సుధాకర్,జి. పాండు,బొల్లి రాజు సాయిబాబా పూస శ్రీనివాస్ ఎన్.వి.పాఠక్, బి.ఆనంద్ కుమార్ టి.నవీన్ కుమార్,పి.సుధాకర్, రాజేంద్ర ప్రసాద్ మహేష్,సంతోష్,శ్రీకాంత్ రెడ్డి కిషోర్ ఎస్.సంతోష్, డేవిడ్ పాల్గొన్నారు.

## సావర్కర్ నగర్ లో సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్



**ఉప్పల్,జూలై 30(సూర్యరేఖ)** అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నాచారం కార్పొరేటర్ శాంతిసాయి జన్ శేఖర్ అధికారులకు సూచించారు. నాచారం డివిజన్ లో రూ.50 లక్షల వ్యయంలో సావర్కర్ నగర్ లో జరుగుతున్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ బుధవారం అధికారులతో కలిసి పర్యవేక్షించడం జరిగింది.సావర్కర్ నగర్ లో రోడ్డు నిర్మాణం పట్ల కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేయడం జరిగింది.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ...త్వరలోనే సావర్కర్ నగర్ లో నెలకొన్న మైనారిటీ గురుకుల పాఠశాల డ్రైనేజీ సమస్యను కూడ తొందరలోనే పరిష్కరిస్తామని కార్పొరేటర్ పేర్కొన్నారు.తన దృష్టికి ప్రజలు తీసుకొచ్చిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఏ.ఈ.వినీత్,వర్క్ ఇన్స్పెక్టర్ విజయకుమార్,బీఆర్ ఎస్ నాయకులు కట్ట బుచ్చన్న గౌడ్,సంతోష్ గౌడ్, ఈశ్వర్ గౌడ్,కాలనీవాసులు రామ్ రెడ్డి,రమేష్, పోలీస్ శర్మ,తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుంటలో పౌర హక్కుల దినోత్సవం..



**నిజాంపేట,జూలై 30(సూర్యరేఖ)** మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో బుధవారం స్థానిక,తహసీల్దార్ శ్రీనివాస్,ఎస్ఐ రాజేష్,ల ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామంలో కుల వివక్ష,అంటరానితనం,హొటల్ లో రెండు గ్లాసుల పద్ధతి విడనాడాలన్నారు.ఎవరైనా కులం పేరుతో దూషించినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని లేదా 100 డైల్ చేయాలన్నారు.అనంతరం సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఇమాద్, కార్యదర్శికవిత గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీసీ సెల్ ఏర్పాటు..

**ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య**



**రాజేంద్రనగర్,జూలై30 (సూర్యరేఖ)** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీసీ సెల్ ఏర్పాటు చేయవలసిందిగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉద్యోగులు విశ్వవిద్యాలయం విద్యార్థుల ప్రతినిధులు ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యకు కొన్ని రోజుల క్రితం వినతి పత్రం ఇచ్చారు. బుధవారం సమావేశమైన వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకమండలి ఈ అంశాన్ని అన్ని కోణాల నుంచి చర్చించింది. విశ్వవిద్యాలయాల్లో బీసీ సెల్ ఏర్పాటు గురించి 2018లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) ఇచ్చిన మార్గదర్శకాల గురించి అలాగే 2008లో అశోక్ కుమార్ ఠాకూర్, యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుల్ని పాలకమండలి చర్చించింది. అదేవి ధంగా రాష్ట్రంలోని ఉస్మానియా,కాకతీయ, ఇతర విశ్వవిద్యాలయాల్లో ఇప్పటికే గత కొన్ని ఏళ్ల క్రితం బీసీ సెల్ లని ఏర్పాటుచేసిన విషయాన్ని బిసి ఉద్యోగులు,విద్యార్థులు విశ్వవిద్యాలయ దృష్టికి తీసుకొచ్చిన అంశాన్ని పాలకమండలి విపులంగా పరిశీలించింది.వాటన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించిన మీదట వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బిసి సెల్ ఏర్పాటు చేసే అంశాన్ని పాలకమండలి ఏకగ్రీవంగా ఆమోదించింది.ఎస్సీ,ఎస్టీ సెల్ ల మాదిరిగానే బిసి సెల్ ఏర్పాటు చేయాలని పాలకమండలి నిర్ణయించింది.వ్యవసాయ విశ్వవిద్యాలయం బోధన సిబ్బందిలో సుమారు 40 శాతం బిసి సామాజిక వర్గాలకి చెందినవారు ఉన్నారని,అదేవిధంగా బోధనేతర సిబ్బందిలో సుమారు 50 శాతం సిబ్బంది బిసి సామాజిక వర్గాలకి చెందిన వారు ఉన్నారని ఉపకులపతి అల్దాస్ జానయ్య పాలకమండలికి వివరించారు.అలాగే వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థుల్లోనూ సుమారు సగానికి పైగా విద్యార్థులు బిసి సామాజిక వర్గాలవారే ఉన్నారని జానయ్య పాలకమండలి దృష్టికి తీసుకువచ్చారు.ఈ నేపథ్యంలో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బిసి సెల్ ఏర్పాటు చేయడం సబబేనని పాలక మండలి అభిప్రాయపడింది.బీసీ సమాజానికి చెందిన ఉద్యోగులు విద్యార్థుల సంక్షేమానికి తీసుకోవలసిన చర్యల గురించి ఈ సెల్ సూచిస్తుందని ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వివరించారు.

# అంతర్జాతీయ సదస్సులు విద్యార్థులకు పరిశోధన దిశగా ప్రేరేపిస్తాయి

### ఐఎస్ఐఆర్,ఐఐసిటి డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి
### లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు..





**ఉప్పల్,జూలై30(సూర్యరేఖ)**ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కాలేజీలో మూడు రోజుల పాటు (జూలై 28 నుండి 30 వరకు)అత్యంత విజ్ఞానపరమైన వినూత్నతతో నిండిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐసిఈటిఎస్ టి 2025) అంతర్జాతీయ సదస్సు బుధవారం ముగింపు కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిఎస్ఐఆర్ ఐఐసిటి డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తమ ప్రసంగంలో శాస్త్రీయ పరిశోధనలలో యువత చేరాల్సిన అవసరాన్ని ఉద్ఘాటించారు.భారతదేశ భవిష్యత్తు సాంకేతిక రంగాల్లో ఉన్న అవకాశాలను వివరించుతూ ఇలాంటి అంతర్జాతీయ సదస్సులు విద్యార్థులకు పరిశోధనా దిశగా ఆలోచించే ప్రేరణను అందిస్తాయని చెప్పారు.విజ్ఞానం ప్రపంచం నలుమూలల నుండి సంకలనం కావలసిన అవసరాన్ని స్పష్టంగా తెలియజేస్తూ,ఈ రకమైన అంతర్జాతీయ వేదికలు విద్యార్థులకు విశ్వవ్యాప్తంగా తమ ప్రతిభను చాటుకునే అవకాశాన్ని కల్పిస్తాయని అన్నారు.డా.శ్రీనివాస రెడ్డిని కళాశాల డైరెక్టర్ రెవరెండ్ బ్రదర్ జాన్,ప్రిన్సిపాల్ జయంతిరెడ్డి



శాలువాతో సత్కరించి,స్మృతిచిహ్నం అందజేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల డైరెక్టర్ రెవరెండ్ బ్రదర్ జాన్ మాట్లాడుతూ. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందుతున్న కొత్తదారులపై జరిగిన సదస్సు విద్యార్థులలో సృజనాత్మకతను ఉత్తేజితం చేసిందని,వారు గ్లోబల్ వ్యాప్తంగా పరిశోధనా అవకాశాల వైపు దృష్టి పెట్టేలా మారుస్తుందని అభిప్రాయపడ్డారు. కళాశాల ప్రిన్సిపాల్ జయంతిరెడ్డి మూడు రోజుల సదస్సు విశేషంగా స్ఫూర్తినిచ్చిందని,విద్యార్థులు అధ్యాపకులు శాస్త్రీయ చర్చల్లో భాగస్వాములవడమే కాక,అంతర్జాతీయ మేధావులతో ప్రత్యక్షంగా మాట్లాడే అవకాశాన్ని కలిగిందని కొనియాడారు.సదస్సు కన్వీనర్ విజయ్ రెడ్డి ముగింపు సందేశం ద్వారా,మూడు రోజుల్లో జరిగిన శాస్త్రీయ పత్రాల ప్రజెంటేషన్లు టెక్నికల్ సెషన్లు ఇంటరాక్టివ్ డిస్కషన్లు అన్నీ కూడా ఈ సదస్సు స్థాయిని ఎంతో ఉన్నతంగా నిలబెట్టాయని పేర్కొన్నారు. ఆయన తన టీమ్‌కు, ముఖ్యంగా విద్యార్థుల భాగస్వామ్యానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఐక్యూఏసి సమన్వయకర్త ప్రశాంత్ సదస్సు విజయం వెనక పనిచేసిన బృందానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని అద్భుత కార్యక్రమాలు నిర్వహించేందుకు కళాశాల సిద్ధంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉత్తమ పరిశోధన పత్రాలకు అవార్డులు అందజేయడం, స్పీకర్లకు కృతజ్ఞతాపూర్వక సన్మానం వంటి ఘట్టాలు ముగింపు సభకు ప్రత్యేకతను తీసుకువచ్చాయి. సదస్సు విజయవంతంగా పూర్తవడాన్ని ఒక గొప్ప గౌరవంగా భావిస్తూ, పాల్గొన్న వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## బీసీ బిల్లు సాధన నిరాహార దీక్ష పోస్టర్ ఆవిష్కరించిన

**జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**



**నాంపల్లి,హైద్రాబాద్,జూలై30(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్రంలో బీసీ బిల్లు సాధన కోసం ఎమ్మెల్సీ,జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆగస్ట్ 4,5,6 తేదీలలో 72 గంటల నిరాహార దీక్ష చేయబోతున్న సందర్భంగా తెలంగాణ జాగృతి,యుపిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టే 72 గంటల నిరాహార దీక్షకు సంబంధించిన పోస్టరును జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేతులమీదుగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యుపిఎఫ్ కార్వాన్ నియోజకవర్గం విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి వరికుప్పల గంగాధర్ మాట్లాడుతూ...బీసీ బిల్లు సాధన కోసం ఆగస్ట్ 4,5,6 తేదీలలో 72 గంటల నిరాహార దీక్ష చేపట్టనున్నఎమ్మెల్సీ,జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు మద్దత్తుగా తెలంగాణ బిసి మేధావులు,యువకులు ఈ దీక్షలో పాల్గొని బీసీ బిల్లు అమలుకై కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్క బీసీ బిడ్డ,బీసీ బిల్లు సాధనకోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో రాంకోటి,సంతోష్ హింగ్లోకర్,శివరాత్రి అజయ్,తదితరులు పాల్గొన్నారు.

## మైలార్ దేవ్ పల్లి డివిజన్ లో పెండింగ్ లో ఉన్న పనులను పూర్తి చేస్తాం..

**రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి**






**రాజేంద్రనగర్,జులై30(సూర్యరేఖ)**రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ లో పెండింగ్ లో ఉన్న పనులను పూర్తి చేయాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.అవసరం ఉన్న చోట ప్రణాళిక చేసిన దాదాపు రూ.250.05 లక్షల విలువగల సీసీ రోడ్డు పనులను,డివిజన్ పరిధిలోని పెండింగ్ లో ఉన్న రోడ్ల గురించి త్వరగా మంజూరు అయ్యే విధంగా చూడాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్నను మర్యాదపూర్వకంగా కలిసివినతి పత్రం అందజేశారు.ప్రజలు సరైన రోడ్డు వ్యవస్థ లేనందున బాధపడుతున్నారని పర్యటనలో భాగంగా వీక్షించిన పలు పనులను డివిజన్ పరిధిలోని పనుల ప్రణాళికలు చేసిన పనులను త్వరగా ప్రారంభించే విధంగా చూడాలని జోనల్ కమిషనర్ ను విన్నవించారు.దీనికి సానుకూలంగా స్పందించిన కమిషనర్ త్వరగా పనులను మంజూరయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చినట్లు వివరించారు.పనుల పూర్తికి ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుక రావాలన్నారు

## లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి..

**ఎమ్మెల్యేను కలిసి కోరిన కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు అడికె రాజు**



**రాజేంద్రనగర్,జులై30(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డ్ కాలనీలో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరించాలని నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ను కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు అడికె రాజు కోరారు.ఈ మేరకు అడికె రాజు ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ను సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు.కాలనీలో ఉన్న పార్కులు కమ్యూనిటీ హాల్స్,రోడ్లు,అండర్ గ్రౌండ్,డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. దానికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా త్వరలోనే సమస్యలన్నింటికీ పరిష్కరిస్తానని,మీరందరూ సహకరించాలని అన్నారు. హౌసింగ్ బోర్డ్ పూర్తి బాధ్యతను జిహెచ్ఎంసికి ఇచ్చింది,కాబట్టి జిహెచ్ఎంసి అధికారులు ఇప్పటికైనా కాలనీలో సమస్యలను గుర్తించి కనీస వసతులు కల్పించాలని కాలనీ అధ్యక్షులు అడికె రాజు కోరారు.

## మొక్కలు నాటి,పూజలు చేసి ఘనంగా శ్రీకేసరి అసోసియేషన్ 10వ వార్షికోత్సవ వేడుకలు..





**నాంపల్లి,హైద్రాబాద్,జూలై30(సూర్యరేఖ)**కార్వాన్ బాంజవాడి ప్రాంతంలోని మహిమాన్విత శ్రీశివ పంచాయత బాలహనుమాన్ దేవాలయంలో శ్రీకేసరి అసోసియేషన్ వ్యవస్థపక అధ్యక్షులు శిరందాస్ గోపాల్,ప్రధాన కార్యదర్శి బాల కృష్ణ,కోశాధికారి మంగలి కృష్ణ పాలక సభ్యుల ఆధ్వర్యంలో శ్రీకేసరి అసోసియేషన్ 10వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా శ్రీశివ పంచాయత బాల హనుమా న్ దేవాలయంలో పురోహితులు అనిరుద్ వేద చేతుల మీదిగా పూజ,అర్చన నిర్వహించి,10వ వార్షికోత్సవం బ్యానర్ ఆవిష్కరించడం జరిగింది. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణకై ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటి,ఆలయానికి వచ్చిన భక్తులకు పలు రకాల మొక్కలు పంపిణి చేసారు.ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ. శ్రీకేసరి అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద విద్యార్థులకు అండగా ఉంటూ,పలు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం జరుగు తోందని తెలిపారు.ఈ సేవ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బొల్లి యాదగిరి,సహా కార్యదర్శులు గంజి జనార్ధన్ యాదయ్య పి.శ్రీశైలం సలహాదా రులు అడికె రమేష్,తదితరులు పాల్గొన్నారు.

# కృంగిన కల్వర్టులు ఇబ్బందులు గురవుతున్న ప్రయాణికులు



**నిజాంపేట,జూలై30(సూర్యరేఖ)**మండల కేంద్రం నుండి జెడ్ చెరువు తండా,బచ్చు రాజుపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో కల్వర్టులు కృంగిపోవడంతో వాహనదారులకు ఇబ్బందులకు గురవుతున్నారు. డాంబర్ రోడ్డు వేసి సంవత్సరాలు గడుస్తున్న రోడ్డు పరిస్థితిని పట్టించుకునే నాధుడే కరువయ్యాడని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.ఇకనైనా ఆర్ అండ్ బి సంబంధిత అధికారులు స్పందించి కుంగి ఉన్న కల్వర్టుల వద్ద పనులను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

**కల్వర్టుల వద్ద పనులు పునరుద్ధరించాలి..**
**బిఆర్ఎస్వి నియోజకవర్గ అధ్యక్షులు బజార్ రంజిత్ గౌడ్..**



ఈ వర్షాకాలం నిజాంపేట నుండి జడ్చెరువు తండా బచ్చురాజుపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో నిర్మించినటువంటి కల్వర్టులు ఈ అకాల వర్షాలకు కృంగిపోవడంతో ప్రయాణికులు వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.ఇకనైనా ఆర్అండ్ బి అధికారులు సందర్శించి కల్వర్టుల వద్ద నాణ్యత లోపాలను పరిశీలించి తక్షణమే పనులు ప్రారంభించాలి.

# రామంతపూర్ చిన్న చెరువు కట్టపై పిచ్చి మొక్కలు, చెట్ల కొమ్మలు తొలగింపు

**పర్యవేక్షించిన కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు**

**ఉప్పల్,జూలై 30 (సూర్యరేఖ)** రామంతపూర్ చిన్న చెరువు కట్టపై ఇరువైపులా చెట్ల కొమ్మలు విపరీతంగా పెరిగి,వాకింగ్ చేసే ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తుందని రామంతపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పిచ్చి మొక్కలు చెట్లు చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు.హార్టికల్చర్ శాఖ,రాంకీ, జిహెచ్ఎంసి అధికారులను వెంటనే రంగంలోకి దింపి, చెరువుకట్టపై ఉన్న పిచ్చిమొక్కలు అడ్డంగా పెరిగిన చెట్ల కొమ్మలు తొలగింపు పనులను ప్రారంభించారు. కట్టపై గుంటలు



పడిన చోట మట్టితో పూడ్చివేశారు. పనులు మూడు రోజులపాటు కొనసాగుతాయని కార్పొరేటర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ సూపర్వైజర్ నరసింహారావు,రాంకీ సూపర్వైజర్ సుధాకర్,జిహెచ్ఎంసి వర్క్ఇన్స్పెక్టర్ మహేందర్, ఇరిగేషన్ ఏ.ఈ.సుధీర్,పడిగం నగేష్ పలువురు పాల్గొన్నారు.

# చిలుకానగర్ డివిజన్ కు మరొకసారి నిధులను విడుదల చేసిన రేవంత్ సర్కార్




**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన సీతారామ కాలనీవాసులు**

**హర్షం వ్యక్తం చేసిన చిలుకనగర్ డివిజన్ ప్రజానీకం**

**ఉప్పల్,జూలై30 (సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వ రెడ్డి ప్రత్యేక చొరవతో చిలుకనగర్ డివిజన్ లోని సీతారామకాలనీ, రాఘవేంద్రనగర్ కాలనీ,బీరప్పగడ్డ ప్రాంతాలకు సీసీ రోడ్ల పనుల నిమిత్తం కోటి 70 లక్షలు మంజూరు చేయడం జరిగినది.ఈ సందర్భంగా ఆకిటి ఆగంరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి చేసిన సీతారామ కాలనీ వాసులు పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా ఆగం రెడ్డి మాట్లాడుతూ. ఉప్పల్ ప్రజల సమస్యలపై నిరంతరం పని చేస్తూ ఉప్పల్ అభివృద్ధి కొరకై కావలసిన నిధుల్ని ప్రత్యేకంగా మంజూరు చేయించినందుకు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రఘుపతిరెడ్డి,బజార్ జగన్, కొంపల్లి బాలరాజ్ బొట్టు రాజేష్ ,తుమ్మల సందీప్, సీతారామకాలనీ అధ్యక్షులు రమేష్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ ఏ.బ్లాక్ అధ్యేక్షురాలు అమరేశ్వరి,చిలుకనగర్ మహిళా అధ్యేక్షురాలు సుశీల,సీనియర్ నాయకులు తూర్పాటి జంగయ్య శ్రీరాములు కిరణ్,గండికోట గణేష్,టైలర్ శ్రీను సుబ్బారావు సాయిలు రాము గౌడ్ రాములు ప్రశాంత్,శంకర్ రాధా కృష్ణ,గీత తదితర నాయకులు కార్యకర్తలు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధి చిలుకానగర్ లో అమానుష్య ఘటన





**పగడాల సునీల్ అనే అంబులెన్స్ సర్వీస్ చేసే వ్యక్తిని చితక బాదిన రహీం అనుచరులు**

**ఉప్పల్,జూలై 30(సూర్యరేఖ)** చిలకానగర్ ఆదర్శ్ నగర్ లో నివాసం ఉంటూ మానవత్వంతో డెడ్ బాడీలను అంబులెన్స్ ద్వారా సేవలందిస్తూ పేదలకు తక్కువ ప్రైజ్ తో,అనాథలకు సునీల్ ఉచితంగా సర్వీస్ అందిస్తున్నారు.రహీం చిలుకా నగర్ ప్రాంతంలో ఉంటూ అంబులెన్స్ సర్వీస్ అందిస్తున్నారు.సునీల్ చేసే సేవకు తమకు గిరాకీ రావడం లేదని కక్ష్య పెట్టుకున్నారు.రహీం ప్లాన్ ప్రకారం ఆదర్శ్ నగర్ లోని ఓశ్మశాన వాటికకి సునీల్ ను గుర్తు తెలియని వ్యక్తి లా అంబులెన్స్ కావాలని శ్మశాన వాటిక వద్దకు రప్పించారు.సునీల్ ఆదర్శ్ నగర్ శ్మశాన వాటిక వద్దకు రావడంతో రహీం, ఇమ్రాన్ రషీద్ ఇబ్రహీంతో పాటు పది మంది ముక్కుమూడిగా సునీల్ పై దాడి చేశారు.దాడి చేసిన అనంతరం సునీల్ అంబులెన్స్ లోనే తీసుకెళ్లే ప్రయత్నం చేయడంతో అంబులెన్స్ నుండి సునీల్ దూకి ప్రాణాలు కాపాడుకోవడం జరిగింది.ఈ నెల 28న రాత్రి జరగగా ఒక్కరోజు ఒక హెడ్ కానిస్టేబుల్ నెగ్లెక్ట్ చేశారని తెలుస్తుంది.సునీల్ ను కొట్టిన విడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానికులు అండతో మళ్ళీ పోలీస్ స్టేషన్ కు రావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు విశ్వహిందూ పరిషత్ నాయకులు సునీల్ కి మద్దతుగా ఉప్పల్ పిఎస్ కి వచ్చి నిరసన తెలిపారు.ఇన్స్పెక్టర్ చొరవతో మాట్లాడి నిందితులను అరెస్ట్ చేసి చట్టం ప్రకారం చర్యలు చేపడుతామని చెప్పడంతో పోలీస్ స్టేషన్ నుండి బీజేపీ విశ్వహిందూపరిషత్ నాయకులు



వెళ్ళిపోయారు. చిలుకానగర్‌లోని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సునీల్ ను విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్ బీజేపీ నాయకులు గోనె శ్రీకాంత్ పరామర్శించారు.నిందితులపై హత్యాయత్నం కేసులు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని, నిందితులకు మద్దతు పలిసిన కానిస్టేబుల్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత సాఫ్ట్‌వేర్ శిక్షణ




**ఉప్పల్,జూలై30(సూర్యరేఖ)**ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత సాఫ్ట్‌వేర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ. ”ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యుగంలో నైపుణ్యాలు కలిగిన వారికి సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగ అవకాశాలు మరింత పెరుగుతాయి. లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ మన కళాశాల విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించడానికి ఈ ఉచిత శిక్షణను అందిస్తోంది. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కళాశాల కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ తిరుపతయ్య మాట్లాడుతూ. ప్రస్తుత కాలంలో ఏ ఉద్యోగానికైనా కంప్యూటర్ నైపుణ్యాలు తప్పనిసరి.ఈ నైపుణ్యాలు లేకపోతే ఉన్నత చదువులు చదివినా ప్రయోజనం ఉండదు. వృత్తి, వ్యాపారం,లేదా ఉద్యోగం ఏదైనా, కంప్యూటర్ పరిజ్ఞానం అనేది కచ్చితంగా అవసరం. విద్యార్థులందరూ ఈ శిక్షణా తరగతులకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ యమున మాట్లాడుతూ...ఈ శిక్షణా కార్యక్రమం పది రోజుల పాటు కొనసాగుతుంది. ద్వితీయ,తృతీయ సంవత్సరం విద్యార్థులు తప్పనిసరిగా ప్రతిరోజూ హాజరై ఈ శిక్షణ ద్వారా ప్రయోజనం పొందాలని సూచించారు.లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ సంజయ్ మాట్లాడుతూ...ఇటువంటి శిక్షణకు బయట వేలాది రూపాయలు ఖర్చు అవుతుంది.ఫౌండేషన్ అందిస్తున్న ఈ ఎంఎస్ ఎక్సెల్ పవర్ బిఐ పైథాన్ ప్రొగ్రమింగ్,సైబర్ సెక్యూరిటీ,ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ కోర్సెస్ ఉంటాయని ఉచిత అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బెల్లంపల్లి తాళ్ల గురజాల ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసిన ఆటో యూనియన్ నాయకులు




**బెల్లంపల్లి,జూలై30(సూర్య రేఖ)**బెల్లంపల్లి రూలర్ తాళ్ల గురజాల పోలీసు స్టేషన్ కు నూతనంగా వచ్చిన ఎస్సైని మర్యాదపూర్వకంగా బెల్లంపల్లి ఆటో యూనియన్ మంచిర్యాల జిల్లా జేఏసీ ఆటో యూనియన్ అధ్యక్షులు కట్ట రామ్ కుమార్,వైస్ ప్రెసిడెంట్ బబ్లు,సెక్రెటరీ బజరంగ్ శేఖర్,బెల్లంపల్లి మండల్ చంద్రవెల్లి ఆటో యూనియన్ ప్రెసిడెంట్ రాజం రాజు,కన్నె పెల్లి మండల్ మెట్టుపల్లి ఆటో పాయింట్ సలహాదారుడు శంకర్,వేమనపల్లి మండల్ జిల్లెడ ఆటో యూనియన్ ప్రెసిడెంట్ అశోక్,ఆటో డ్రైవర్లు తదితరులు కలిసి పూలబొక్కే అందజేశారు.

## యూకే సినీ ఫ్లెక్స్ ను ప్రారంభించిన సినీ నిర్మాత, తెలంగాణ చలచిత్ర టీవీ థియేటర్స్ అభివృద్ధి సంస్థ చైర్మన్ దిల్ రాజు

**- పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,బిఆర్ఎస్ నేత సాయి జన్ శేఖర్**



**ఉప్పల్,జూలై30(సూర్య రేఖ):**నాచారం మెయిన్ రోడ్ లో నూతనంగా నిర్మితమైన యుకే సినిప్లెక్స్ ను సినీ నిర్మాత,తెలంగాణ చలనచిత్ర టీవీ థియేటర్స్ అభివృద్ధి సంస్థ చైర్మన్ దిల్ రాజు,ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బుధవారం సాయంత్రం లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిర్వాహకులు ఉదయ్ కుమార్ కు శుభకాంక్షలు తెలిపారు.హైదరాబాద్ కు కొత్త సినిమా ప్రపంచం యూకే సినీప్లెక్స్ నాచారం అత్యంత విలాసవంతమైన అనుభవమన్నారు. వినోదానికి నూతన శిఖరం అని వారు తెలిపారు.నగరంలో వినోదానికి సంబంధించిన దృశ్యం మరో మెట్టు పైకి వెళుతోందని,నాచారం హృదయంలో నూతనంగా ప్రారంభమవుతున్న యూకే సినీప్లెక్స్,ఒక విలాసవంతమైన 4-స్క్రీన్ మల్టిప్లెక్స్,ఇది కేవలం సినిమా థియేటర్ మాత్రమే కాదు ఇది ఓ అనుభూతి అని అన్నారు.అత్యాధునిక సాంకేతికతతో పాటు,అత్యుత్తమ సౌకర్యాలు కలిగిన ఈ సినీప్లెక్స్ సినిమా ప్రేమికులకు,కుటుంబాలకు ప్రీమియం అనుభవాన్ని అందించేందుకు సిద్ధంగా ఉందని మృదువైన సీటింగ్,ప్రీమియం రీక్లైనర్లు,సౌకర్యవంతమైన సోఫాలు,అటమోస్ సౌండ్,లేజర్ ప్రొజెక్షన్ మరియు సిల్వర్ స్క్రీన్లు,ప్రతి అంశం ప్రేక్షకులను ఒక సినిమాటిక్ ప్రపంచంలోకి తీసుకెళ్లేలా రూపొందించబడిందన్నారు.దీనితో పాటు లైవ్ కౌంటర్లు పిజ్జాలు శాండ్విచ్లు,డెజర్టు వంటి రుచికరమైన ఫుడ్,బివరేజెస్ కూడా అందుబాటులో ఉన్నాయని వారు తెలిపారు.యూకే సినీప్లెక్స్ నాచారం లో ఆగస్టు 31 నుండి ప్రజలకు అందుబాటులోకి రానుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రేటర్ నాయకులు సాయి జన్ శేఖర్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి నూతన ఆలయ నిర్మాణ ప్రతిష్టాపన మహొత్సవానికి హాజరైన ప్రముఖులు.....



**శివంపేట,జులై30 (సూర్య రేఖ)** మెదక్ జిల్లా హత్నూర మండలం కాసాల గ్రామంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రముఖ సంఘ సేవకులు బండారి గంగాధర్,మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్,నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి రాజి రెడ్డి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సుహాసిని రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్,దౌల్తాబాద్ మాజీ సర్పంచ్ కొన్యాల వెంకటేష్,హత్నూర మండల అధ్యక్షులు క్రిష్ణ,హత్నూర మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యం మాజీ ఎంపిటిసిలు అశోక్,భాస్కర్,నర్సాపూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్ కుమార్,నర్సాపూర్ మండల ఓబీసీ సెల్ అధ్యక్షులు అశోక్ గౌడ్,దాడిగా నరేష్,నర్సాపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ యాదవ్ శ్రీకాంత్ వెంకటేష మణిదీప్ ప్రసాద్ నాయకులు ఆలయ కమిటీ సభ్యులతో పాటు వేద పండితులు భక్తులు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బోరు వేయించిన పూర్వ విద్యార్థులు





**విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు అనంతరెడ్డి,జంగయ్య,లతో భూమి పూజ**

**ఉపాధ్యాయులకు సన్మానం చేసి పాదాభివందనాలు చేసిన విద్యార్థులు..**

**రాజేంద్రనగర్,జూలై30(సూర్యరేఖ)**
రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు తమ స్వంత ఖర్చులతో బోరు వేయించారు.పాఠశాలలో బోరు పాడైందని, విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్నాయని ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఎం.సుగుణ బీజేపీ నాయకుడు,పూర్వవిద్యార్థి వై.శ్రీధర్,తో చెప్పగా ఆయన 1982...83 బ్యాచ్ విద్యార్థులు వై. చిన్మయానంద స్వామి,ఎం.కృష్ణరావు,ల దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు.వారు తమ తరగతికి చెందిన విద్యార్థులందరికి సమస్యను వివరించి పాఠశాలలో తమ స్వంత ఖర్చులతో బోరు వేయడానికి ముందుకు వచ్చారు.

**తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులతో బోరు పూజల..**

రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తమకు చిన్ననాడు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులు అనంతరెడ్డి,జంగయ్య,లతో బోరు పూజ చేశారు.

**ప్రార్థనలో పాల్గొన్న విశ్రాంత ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు..**

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రార్థనలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ ఎం.సుగుణలో కలిసి విశ్రాంత ఉపాధ్యాయులు అనంతరెడ్డి, జంగయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అనంతరెడ్డి జంగయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఎం.సుగుణ లను సన్మానించారు. అదేవిధంగా 1982..83వ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఎం.కృష్ణరావును సన్మానం చేశారు. పాఠశాల తరఫున డాక్టర్ ఎం సుగుణ విశ్రాంత ఉపాధ్యాయులైన అనంతరెడ్డి జంగయ్య,లకు సన్మానం చేశారు.

**80ఫీట్లకు నీరు పడగా 515 ఫీట్లు బోరు వేయించిన పూర్వ విద్యార్థులు**

80 ఫీట్లకే నీరు రాగా 515 ఫీట్ల వరకు బోరు వేయించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాడిశెట్టి కృష్ణారావు, యతి పతి చిన్మయానంద స్వామి, శోభ, బి పద్మారావు, కొంగళ్ళ శ్రీనివాస్, జి నరసింహ రవీందర్ వై వివేకానంద ఇక్బాల్ అక్కిరాజు సుబ్బారావు, పీవీ సత్యనారాయణ డి యాదగిరిలు మాట్లాడుతూ, తాము చదువుకున్న పాఠశాలలో బోరు వేయించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని సమాజానికి ఉపయోగపడే వారిగా ఎదగాలన్నారు, ఉపాధ్యాయులను గౌరవించాలని, సంస్కారవంతమైన జీవితాన్ని జీవించాలని సూచించారు.

**చాలా సంతోషంగా ఉంది : విశ్రాంత ఉపాధ్యాయులు**

తాము చిన్ననాడు విద్యాబుద్ధులు చెప్పిన విద్యార్థులు 40 సంవత్సరాలు తర్వాత చదువుకున్న పాఠశాలలో బోరు వేయించడం, అది మా చేతుల మీద పూజలు చేసి ప్రారంభించడం సంతోషంగా ఉందని విశ్రాంత ఉపాధ్యాయులు అనంతరెడ్డి, జంగయ్య లు తెలిపారు. రాజేంద్రనగర్ లో చదువుకున్న విద్యార్థులు చక్కటి సంస్కారవంతులని గుర్తు చేశారు.

**1982 83 బ్యాచ్ విద్యార్థుల సహకారంతో బోరు వేసాం :**

1982 83 లో రాజేంద్రనగర్ ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులందరి సహకారం, భాగస్వామ్యంతో బోరు వేయించాం అని మాడిశెట్టి కృష్ణారావు, యతి పతి చిన్మయానంద స్వామి తెలిపారు. రాజేంద్రనగర్ లో చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి ముందుకు రావాలన్నారు.

# తల్లి పురుగుల పాలిట బ్రహ్మాస్త్రం దీపపు ఎర



**రామాయంపేట,జూలై30(సూర్యరేఖ)** ముఖ్యంగా వరి,మొక్కజొన్న,ప్రత్తి పప్పు జాతి వంటి పంటలలో కాండంతోల్చు పురుగుల ఉధృతి వల్ల పంటల దిగుబడిలో 20 నుండి 30 శాతం దిగుబడి తగ్గే అవకాశం ఉంది వీటి నివారణ కోసం రైతులు ఎక్కువసార్లు పురుగు మందుల పిచికారి చేయించాల్సి ఉంటుంది. మోతాదుకు మించి పురుగు మందులు వాడడం వల్ల పురుగులకు రోగనిరోధక శక్తి పెరిగి శక్తివంతమైన పురుగుమందులు వాడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.అదేవిధంగా రైతులకు పెట్టుబడి ఖర్చులు,పర్యావరణ కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో కాండం తోలుచు పురుగుల తర్వాత దశ అయిన తల్లి పురుగులను సమర్థవంతంగా అరికట్టడానికి మనకు మార్కెట్లో ఎలాంటి పురుగులు మందులు గాని సస్యరక్షణ చర్యలు లేవు.వీటి నివారణకు కేవలం దీపపు కాంతి ఎరాలను సాయంత్రం వేళ్లలో పొలంలో అమర్చడం ద్వారా తల్లి పురుగులను ఆకర్షించి చంపివేయడం మాత్రమే ఏకైక మార్గం ఒక్కొక్క తల్లి పురుగు పంటదశలో సుమారుగా 300 నుండి 400 గుడ్లను పెట్టే అవకాశం ఉంది ఈ గుడ్ల నుండి మొదటి దశ కాండం తోలుచు పురుగులు వచ్చి ఆకులను తిని వేయడం వల్ల మొక్కల పెరుగుదల తీవ్ర దుష్ప్రభావం తోపాటుగా కొన్ని సందర్భాల్లో పంట మొత్తం పాడయ్యే అవకాశం ఉంది.ఈ తల్లి పురుగులు పంటలపై ప్రత్యక్షంగా ఎలాంటి నష్టం వాటిల్లకుండా పరోక్షంగా ఎక్కువ సంఖ్యలో గుడ్లను పెట్టి వాటి ద్వారా పంటలకు ఆర్థికంగా నష్టం వాటిల్లే అవకాశాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వాటిని అరికట్టడానికి ఏకైక మార్గం దీపపు కాంతి ఎర, మార్కెట్లో దొరికేటువంటి లైట్ ట్రాప్ ధర సుమారుగా మూడు నుంచి నాలుగు వేల రూపాయల్లో లభ్యమవుతుంది.చిన్న సన్నకారు రైతుల సౌలభ్యం కోసం అతి తక్కువ ఖర్చుతో తయారు చేయబడినటువంటి దీపపు కాంతి ఎర వాడకంపై అవగాహన కల్పించడం జరిగింది. బుధవారం రామయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామంలో లక్ష్మి అనే మహిళ రైతు క్షేత్రాన్ని పర్యటించి వరి,మునగ పంటలను పరిశీలించి కాండం తొలిచే పురుగుల తల్లి పురుగుల నియంత్రణ కోసం అతి తక్కువ ఖర్చుతో తయారుచేయబడి పొలంలో ఏర్పాటు చేసిన దీపపు ఏరను పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా ఇన్చార్జి వ్యవసాయ సహాయ సంచాలకులు రాజనారాయణ మాట్లాడుతూ...ఈ లైట్ ట్రాప్ వాడకం ద్వారా అధిక సంఖ్యలో తల్లిపురుగులను, విద్యుత్ కాంతికి ఆకర్షించడం ద్వారా అతి తక్కువ ఖర్చుతో అతి సులభంగా అతి సమర్థవంతంగా వివిధ పంటలలో సోకేటువంటి కాండం తోలుచు పురుగుల తల్లి పురుగులను ఆకర్షించి చంపివేయవచ్చు.అని తద్వారా తరువాత దశలో వీటి నియంత్రణ అతి సమర్థవంతంగా చేపట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో వీటి తయారీకి కేవలం 300 నుండి 400 రూపాయల ఖర్చు మాత్రమే అవుతుందని,ఇది పంట ప్రాథమిక దశ నుండి పంట కోత అయ్యేవరకు ఏర్పాటు చేసుకున్నట్లు అయితే చీడపీడలను అతి సమర్థవంతంగా అరికట్టే అవకాశం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయం ఇస్తానని అధికారి సందీప్ తో పాటుగా మహిళా రైతు పాల్గొన్నారు.

## లిరాయికోడ్ మండలం ఆదర్శపాఠశాలలో ఊధ్యాయుల కొరత

పట్టించుకోని కొత్తగా వచ్చిన ప్రిన్సిపాల్




**అందోల్,జులై 30(సూర్య రేఖ)** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాల లో టీచర్లు లేక ఇంకా 10 వ తరగతి విద్యార్థులకు ఇంకా క్లాసులు కూడా మొదలు పెట్టలేదు.ప్రిన్సిపల్ కు వెళ్లి అడగదామంటే కస్సు బస్సు అంటూ మీరెవరు నాకు అడుగునికి బెదిరిస్తది అని,పిల్లల తల్లిదండ్రులకు కనీసం ఏదైన సమస్య చెప్పుదమని వెళ్లిన పట్టించుకోదు,కావున జిల్లా పాలనా అధికారి కలెక్టర్,డిఇఓ చొరవ తీసుకోని రాయికోడ్ మండలం ఆదర్శ పాఠశాలలో హిందీ,గణితం టీచర్లు లేక 10వ తరగతి విద్యార్థులకు రెండు సబ్జెక్టులు ఇంకా మొదలు కాలేదు కావున మండలంలోని ఆదర్శ పాఠశాల పిల్లల తల్లిదండ్రులు వెళ్లి ప్రిన్సిపాల్ కు అడుగుతే నేనేము చెయ్యాలి అంటూ పొంతన లేని సమాధానం చెప్పడంతో పిల్లల తల్లి తండ్రులు ఉన్నత అధికారులకు పిర్యాదు చేస్తామని తెలుపడం జరిగింది.అలాగే యస్ యఫ్ ఐ వాళ్లకు కూడా సమాచారం ఇచ్చి వాళ్లతో కూడా కలెక్టర్ గారీ దృష్టికి తీసుకవేల్తమని ప్రిన్సిపాల్ కు ఎన్నిసార్లు అడిగినా అంటి ముట్టనట్లుగా వ్యవహరిస్తుందని తల్లిదండ్రులు వాపోతున్నారు.కావున వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని,లేని యెడల ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలియపరిచారు.

## శంషాబాద్ విమానాశ్రయంలో రూ.40కోట్ల విలువైన గంజాయి పట్టివేత..



**శంషాబాద్,జూలై30(సూర్యరేఖ)** కోట్ల విలువైన హైడ్రోఫోనిక్ గంజాయిని శంషాబాద్ విమానాశ్రయంలో నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారులు పట్టుకున్నారు.బ్యాంకాక్ నుంచి వచ్చిన మహిళా ప్రయాణికురాలి వద్ద 40 కిలోల గంజాయి ఉన్నట్లు అధికారులు గుర్తించారు.దీంతో ఆమెను అదుపులోకి తీసుకొని,గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.బ్యాంకాక్ నుంచి భారత్ లోని వివిధ ప్రాంతాలకు నేరుగా విమాన సర్వీసులున్నా. అనుమానం రాకుండా ఉండేందుకు ఆమె బ్యాంకాక్ నుంచి దుబాయ్ మీదుగా భారత్ వచ్చినట్లు అధికారులు తెలిపారు.థాయ్‌లాండ్ భారత్ మధ్యడ్రగ్స్ సిండికేట్‌పై నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారులు ఆరా తీస్తున్నారు.భారత్‌లో హైడ్రోఫోనిక్ గంజాయికి డిమాండ్ ఉండడంతో ఇక్కడకు తీసుకువచ్చినట్లు తెలిపింది.దీనిపై అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## భార్య సహజీవనం తట్టుకోలేక..

**నల్గొండ :** వివాహేతర సంబంధాలు పచ్చని కాపురాల్లో చిచ్చు పెడుతున్నాయి. తమ సంబంధానికి అడ్డుగా ఉన్నారన్న కారణంతో.. దారుణాలకు పాల్పడుతున్నారు.. ఈ అక్రమ సంబంధాలు చివరకు దాడులు, హత్యలకు దారితీస్తున్నాయి. ఇలాంటి ఘటనలో కుటుంబాలు చిన్నాభిన్నం అవ్వడంతోపాటు.. బాధితుల బిడ్డలు అనాథలుగా మారుతుండడం అందరిని కలవరపెడుతోంది. వివాహేతర సంబంధం పెట్టుకున్న భార్య, ప్రియుడిపై.. భర్త కత్తులతో దాడి చేసిన ఘటన తెలంగాణలో కలకలం రేపింది. వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా కొత్తపల్లి గ్రామానికి చెందిన నాగబోయిన రవి, లావణ్యలకు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి నలుగురు పిల్లలు ఉన్నారు. తొలుత వీరి సంసారం సాఫీగా సాగినప్పటికీ కొంత కాలంగా కుటుంబంలో గొడవలు ప్రారంభ మయ్యాయి. ఇదే గ్రామానికి చెందిన రవి ఫ్రెండ్, క్లాస్ మెట్ అయిన శంకర్ తో లావణ్య వివాహేతర సంబంధం పెట్టుకుంది. శంకర్ కు కూడా ఆల్రెడీ మ్యారేజ్ అయింది. దీంతో కుటుంబంలో గొడవలు తీవ్రమయ్యాయి. వివాహేతర సంబంధం మానుకోవాలంటూ భార్యను హెచ్చరించాడు.ఈ క్రమంలోనే.. మూడేళ్ల క్రితం తల్లి గారి ఇంటికి అని చెప్పి పిల్లలతో వెళ్ళిన లావణ్య భర్త రవిని వదిలేసింది. దీంతో ఎనిమిది నెలల క్రితం రవి కూడా రెండో వివాహం చేసుకున్నాడు. అయితే కొద్ది రోజుల క్రితం లావణ్య.. పిల్లలతో కలిసి యాదాద్రి జిల్లా భువనగిరి మండలం రాయగిరికి మకాం మార్చింది. ఇక్కడే ప్రియుడు శంకర్ తో సహజీవనం సాగిస్తోంది. ఇదే సమయంలో రవి పెద్ద కూతురు ఇన్‌స్టాగ్రామ్ లో ఓ ఫోటో పోస్ట్ చేసింది. ఫోటో లొకేషన్ ఆధారంగా భార్య లావణ్య రాయగిరిలో ఉన్నట్లు రవి గుర్తించాడు. ప్రియుడు శంకర్‌తో కలిసి లావణ్య సహజీవనం చేస్తోందని తెలిసి రగిలిపోయాడు. ఎలాగైనా శంకర్ ను హత్య చేయాలని రవి పథకం వేశాడు.ఇందులో భాగంగా రెండు రోజుల క్రితం ఇల్లు అద్దెకు కావాలంటూ తన రెండో భార్యతో రవి రాయగిరికి వచ్చాడు. లావణ్య శంకర్ ఉంటున్న ఇంటిదగ్గర రెక్కి వేశాడు రవి. భార్య లావణ్య, ప్రియుడు శంకర్ కలిసి ఉన్నారన్న సమాచారంతో భర్త రవి.. లావణ్య ఇంటికి వెళ్ళాడు. శంకర్ పై కత్తితో దాడి చేసేందుకు ప్రయత్నించగా భార్య లావణ్య అడ్డుకుంది.. ఇదే సమయంలో శంకర్ ఇంటి నుండి పరారయ్యాడు. ఆగ్రహంతో ఉన్న రవి కత్తితో భార్యపై దాడి చేశాడు. ఈ దాడిలో భార్య లావణ్య కాళ్లు రెండు విరిగిపోయాయి. లావణ్యను చికిత్స కోసం పోలీసులు హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. లావణ్య బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్న దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా రమ్య,వేణుగోపాల్ రావు,ల వివాహ వేడుక





**రాజేంద్రనగర్,జూలై30(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్ గూడ వాస్తవ్యులు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు,దళిత రత్న వనం నరసింహమాదిగ, లక్ష్మీబాయి,ల కుమార్తె రమ్య వివాహం బుధవారం జొన్నాడ యాదయ్య,చంద్రకళ,ల కుమారుడు వేణుగోపాల్ రావుతో ఘనంగా జరిగింది. అత్తాపూర్ ఎస్ఎన్ఆర్ గార్డెన్ లో వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. వివాహ వేడుకలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్,చేవెళ్ళ ఎమ్మెల్యే కాలే యాదయ్య,బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి,దళిత రత్న వనం శ్రీరాములు సీనియర్ పాత్రికేయులు మ్యాడమ్ మధుసూదన్,వివిధ పార్టీల నాయకులు మ్యాడమ్ రామేశ్వర్ రావు,కొలన్ సుభాష్ రెడ్డి,సామ ఇంద్రపాల్ రెడ్డి,ఎం. కొమురయ్య ఎన్.మల్లారెడ్డి లతో పాటు సామాజిక కార్యకర్త లు,వనం నరసింహ మాదిగ, కుటుంబ సభ్యులు బందువులు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# మైలార్ దేవ్ పల్లి డివిజన్ లో సమస్యల పరిష్కారానికి కృషి





**నియోజకవర్గం ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్,జులై30(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా కృషి చేయడం జరుగుతుందని నియోజకవర్గం ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బాబుల్ రెడ్డినగర్ అభివృద్ధి పనుల్లో భాగంగా నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు పనులను ఆయన జీహెచ్ఎంసీ జలమండలి అధికారులతో కలిసి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులలో ఎక్కడ కూడా ఇలాంటి నాణ్యత లోపాలు లేకుండా చూడాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో నిర్ణీత సమయంలో అభివృద్ధి పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారానికి అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అభివృద్ధి పనులపై అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మైలార్ దేవ్ పల్లి డివిజన్ లోని గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని రంగాలలో ఆదర్శవంతమైన డివిజన్ గా తీర్చిదిద్దడానికి అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇంకా డివిజన్ పరిధిలో ఏమైనా సమస్యలు ఉంటే బస్తీవాసులు తన దృష్టికి తీసుకుని వస్తే అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని బస్తీవాసులకు హామీ ఇచ్చారు. ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ పాండుయాదవ్ రమేష్ రెడ్డి వెంకటరమణగుప్తా సంతూగౌడ్ బొమ్మరాజు నరసింహ,మధుసూదన్ రెడ్డి,రావుల భాస్కర్ చింటూ రెడ్డి శేఖర్ బబ్లూ,ఏన్ను శ్రీనివాస్ రెడ్డి యాదవ్ నవారు మురళీధర్ రెడ్డి మజర్ భాయ్ సంతూగౌడ్ గోపాల్ నాయక్ రమేష్ రెడ్డి కుర్మయ్య అనిల్ ముదిరాజ్ నిశాంత్ శశిధర్ రెడ్డి శంకర్ బాలకృష్ణ కురుమూర్తి జీహెచ్ఎంసీ ఏఈ నరసింహ మూర్తి,వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్ జలమండలి సూపర్ వైజర్ సూపర్ వైజర్ లోక్ నాథ్,వాటర్ వర్క్ రఘు నాయక్ బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డు నిరంతర ప్రక్రియ





**మేడిపల్లి :** రేషన్ కార్డు ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని వేములవాడ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం రోజున వేములవాడ నియోజకవర్గంలోని మేడిపల్లి మండలంలోని పీఎన్ఆర్ గార్డెన్ లో నిర్వహించిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో నూతనంగా మంజూరైన 480 కొత్త తెల్ల రేషన్ కార్డులను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తో కలిసి లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేములవాడ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ మాట్లాడుతూ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమ కోసం పాటు పడుతుందని, వారి అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. రేషన్ కార్డు అనేది నిరంతర ప్రక్రియ అని వాటిలో మార్పులు ? చేర్పులు చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. తెల్ల రేషన్ కార్డు ద్వారా మనిషికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు లేని అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులను అందజేస్తున్నదని సన్న బియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు మహాలక్ష్మి పథకం అందించి ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించి, మహిళలను కోటీశ్వరులు చేయాలన్న ప్రభుత్వ దృఢ సంకల్పాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఎన్నో కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేస్తున్నదని వీటన్నిటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం కొత్త కార్డు రాని వారు ఇబ్బందులు పడాల్సిన పని లేదని, రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. ప్రతి పేదవాడికి రేషన్ కార్డు ఒక ఆత్మగౌరవమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి పేదవాడి అవసరాన్ని గుర్తించిందని తెలిపారు. ఇందులో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారందరికీ రేషన్ కార్డు అందిస్తోందని అన్నారు. ఈ కార్డు పంపిణీ ప్రక్రియ నిరంతరమని, ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, నియోజకవర్గంలో తొలి విడతగా 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. రానున్న కాలంలో ప్రతి అర్హునికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామని అన్నారు. రేషన్ కార్డుల్లో పేర్లు లేకపోవడం వల్ల మహిళలే ఎక్కువగా ఇబ్బంది పడ్డారని, మహిళల పేరు నమోదు అవ్వడమే కాకుండా, కుటుంబ రేషన్ కార్డులో యజమానిగా ఉండడం మంచి విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ జివాకర్ రెడ్డి, సివిల్ సప్లై అధికారి జితేందర్ రెడ్డి, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఎమ్మార్వో, ఎంపిడిఓ, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయం పరీక్షల నిర్వాహణలో అనేక మార్పులకు శ్రీకారం..

**నేడు పదవీ విరమణ చేయనున్న డాక్టర్ జి.శ్రావణ్ కుమార్**



**రాజేంద్రనగర్,జూలై30 (సూర్యరేఖ)** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరీక్షల నిర్వాహణ విభాగంలో సుదీర్ఘకాలం పాటు పనిచేసి, అనేక మార్పులకు, సంస్కరణలకు శ్రీకారం చుట్టిన డాక్టర్ జి.శ్రావణ్ కుమార్ ఈ నెల31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. 20 సంవత్సరాల పాటు వ్యవసాయ, వెటర్నరీ ఉద్యాన డిగ్రీ కోర్సులకు కంబైన్డ్ కౌన్సిలింగ్ ను నిర్వహించారు. ఆరు సంవత్సరాల పాటు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ గా పనిచేసిన శ్రావణ్ కుమార్ అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఆయన హయంలో డిజిటల్ ఎగ్జామినేషన్ సిస్టమ్,ను తీసుకువచ్చారు. కోవిడ్ సమయంలో ఆన్ లైన్ కాన్వకేషన్ నిర్వహించడంలో సాటిగా నిలిచారు. విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల కృషితో ఆయన కాలానికణుగుణంగా మార్పులు,చేర్పులు చేశారు. విశ్వవిద్యాలయం విద్యార్థులకు పార్ట్ - ఎ పరీక్షలలో ఓఎంఆర్ షీట్ విధానాన్ని ప్రవేశపెట్టారు. వర్సిటీలో నిర్మించిన ప్రత్యేక పరీక్షల భవన నిర్మాణంలో డాక్టర్ శ్రావణ్ కుమార్ పాత్ర ఉంది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ లో డాక్టర్ మహేందర్ రెడ్డి ఛైర్మన్ గా ఉన్న సమయంలో 11 నెలల పాటు పరీక్షల నియంత్రణ విభాగంలో పనిచేసిన ఆయన తన ప్రత్యేకతను చాటుకున్నారు. నల్గొండ జిల్లా నోమల ప్రాంతానికి చెందిన శ్రావణ్ కుమార్ ప్రాథమిక విద్యాభ్యాసం నోములలోనే చేశారు. ఇంటర్మీడియట్ సూర్యాపేట్ లో చేసిన ఆయన ఇంగ్లీష్ లో ఎం.ఎ. ఎంఫిల్, పీహెచ్ఎ లను ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పూర్తి చేశారు. 1999లో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా చేరిన ఆయన 20 ఏండ్లు పాటు వర్సిటీ పరీక్షల నియంత్రణ విభాగంలోనే పనిచేశారు. డాక్టర్ శ్రావణ్ కుమార్ 40 గెస్ట్ లెక్చర్స్ ఇచ్చారు. 2023లో బెస్ట్ టీచర్ అవార్డును గెలుచుకున్నారు.

## టీసీఎస్ లేఆఫ్స్ వేళ.. ఇన్ఫోసిస్‌లో 20 వేల ఉద్యోగాలంటూ కీలక ప్రకటన

**హైదరాబాద్ :** భారత్‌లోని అతి పెద్ద ఐటీ సర్వీసుల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ పెద్ద ఎత్తున లేఆఫ్స్ ప్రకటించి ఉద్యోగులకు షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది కల్లా తన మొత్తం ఉద్యోగుల్లో 2 శాతం అంటే దాదాపు 12,200 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించింది. టీసీఎస్‌లో ఉద్యోగుల తొలగింపు వేల దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ తాజాగా కీలక ప్రకటన చేసింది. ఈ ఏడాది సుమారు 20 వేల మంది కాలేజ్ గ్రాడ్యుయేట్లను నియమించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది. ఓ జాతీయ మీడియాతో ఇన్ఫీ సీఈఓ సలీల్ పరేఖ్ మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. ఇక ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో 17 వేల మందికిపైగా ఉద్యోగులను నియమించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై కంపెనీ ఎక్కువగా దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే భారీగా హైరింగ్‌కు సిద్ధమవుతున్నామని సీఈఓ తెలిపారు.'ఈ ఏడాది మొదటి త్రైమాసికంలోనే 17 వేల మందికి పైగా నియమించుకున్నాం. మొత్తం 2025 సంవత్సరానికి 20 వేల మంది కాలేజ్ గ్రాడ్యుయేట్లను నియమించుకోవాలని భావిస్తున్నాం. కృత్రిమ మేధస్సు (ఎఐ), డిజిటల్ మార్పులు, తదితర రంగాల్లో ఇన్ఫోసిస్ ఇప్పటికే పెట్టుబడులు పెట్టింది. ఇప్పటివరకు సంస్థ దాదాపు 2.75 లక్షల మంది ఉద్యోగులకు వివిధ స్థాయిల్లో డిజిటల్, ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చింది' అని సీఈఓ వెల్లడించారు.

## ఎపిలో మద్యం స్కామ్.. రంగారెడ్డిలో నగదు డంప్ పట్టివేత

**హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ మద్యం స్కామ్ కేసులో మరో సంచలనం వెలుగులోకి వచ్చింది. అక్రమ మద్యం నగదు డంప్‌ను ఎపి సిట్ అధికారులు పట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కాచారంలో నగదును ఎపి సిట్ అధికారులు పట్టుకున్నారు. సులోచన ఫార్మ్స్ గెస్ట్‌హౌజ్‌లో 12 అట్టపెట్టెల్లో దాచిన రూ.11 కోట్ల నగదును పట్టుకున్నారు. రాజ్ కసిరెడ్డి సూచనల మేరకు నగదును 12 బాక్సుల్లో ఉంచినట్టు గుర్తించారు. నిందితుడు వరుణ్ పురుషోత్తమ్ వాంగ్మూలం ఆధారంగా ఎపి సిట్ సోదాలు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ మద్యం స్కామ్ కేసులో ఎ40గా వరుణ్ పురుషోత్తమ్ ఉన్నాడు. నగదు సీజ్ ఘటనలో చాణక్య, వినయ్ ప్రాతపైనా విచారణ చేస్తున్నారు. రాజ్ కెసి రెడ్డి, చాణక్య ఆదేశాల మేరకు జూన్ 2024లో వినయ్ సాయంతో వరుణ్ రూ.11 కోట్ల నగదును 12 అట్ట పెట్టెలను ఆఫీస్ ఫైళ్ల పేరుతో దాచినట్టు అధికారులు గుర్తించారు. వరుణ్ పురుషోత్తమ్ నేరాన్ని అంగీకరించి నిజాలు బయటపెట్టడంతో లిక్కర్ స్కామ్ వెలుగులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ మద్యం స్కామ్ లో రూ.3500 కోట్ల పైగా అక్రమాలు జరిగినట్టు అధికారులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

**అధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు ఆదేశం**

**హైదరాబాద్ :** ఆగస్టు 15న గోల్కొండ కోటలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు ఆదేశించారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో సీనియర్ అధికారులతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అమరవీరుల స్మారక చిహ్నం వద్ద నివాళులు అర్పించనున్నారని, అనంతరం చారిత్రాత్మక గోల్కొండ కోటలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారని, అందుకు కావాల్సిన ఏర్పాట్లపై అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని, ఈ కార్యక్రమానికి ప్రముఖులు హాజరవుతున్న సందర్భంగా తగిన భద్రత ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పండుగ స్ఫూర్తిని ప్రతిబింబించేలా తెలంగాణ శాసనసభ, హైకోర్టు, రాజ్ భవన్, సచివాలయం, తెలంగాణ తల్లి విగ్రహాలు వంటి ప్రముఖ ప్రభుత్వ భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. గోల్కొండ కోటలో జరిగే అధికారిక వేడుకల్లో భాగంగా రాష్ట్ర వారసత్వం, దేశభక్తిని ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని సాంస్కృతిక శాఖను ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను దృష్టి పెట్టుకొని అందుకు అవసరమైన అగ్నిమాపక భద్రతా సిబ్బంది, అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అగ్నిమాపకశాఖ అధికారులను ఆదేశించారు. దినోత్సవ వేడుకలకు ఎలాంటి విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల గౌరవం మరియు వైభవాన్ని కాపాడటానికి ప్రతి శాఖ సమన్వయంతో పని చేయాలని ఆయన ఆదేశించారు.

# బిజినెస్

## ఐటి పరిశ్రమలో ఇక కోతలే!



భారత ఐటి రంగంలో మరిన్ని ఉద్వాసనలు చోటు చేసుకోనున్నాయని ఐటి సేవల కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే నాస్కామ్ అంచనా వేసింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పరిశ్రమలో పెను మార్పులు వస్తున్నాయని పేర్కొంది. ఈ దశలో రాబోయే నెలల్లో మరిన్ని ఉద్యోగ కోతలు జరిగే అవకాశం ఉందని నాస్కామ్ మంగళవారం ఓ రిపోర్ట్‌లో హెచ్చరించిం ది. దేశంలోనే అతిపెద్ద ఐటి కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) ప్రపంచ వ్యాప్తంగా 2 శాతానికి సమానమయ్యే 12,000 మందిపై వేటు వేస్తోన్న నేపథ్యంలో నాస్కామ్ ప్రకటనకు ప్రాధాన్యం సంతరించుకుంది. ఐటి పరిశ్రమకు ఇది ఓ మలుపు సమయని పేర్కొంది. "ప్రపంచవ్యాప్తంగా క్లయింట్‌లు ఐటి సేవల నుండి వేగవంతమైన, సౌలభ్యమైన, ఆవిష్కరణాత్మక ఫలితాలను డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఐటి కంపెనీలు కృత్రిమ మేధా (ఎఐ), ఆటోమేషన్‌పై దృష్టి పెడుతున్నారు. కొన్ని సాంప్రదాయ నైపుణ్యాలకు కాలం చెల్లుతోంది. ఉద్యోగులు కెరీర్ మార్పులు లేదా నైపుణ్య అభివృద్ధి దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. టిసిఎస్ ఇటీవల 12,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించడం ఈ ధోరణికి ఉదాహరణ. ఇతర ఐటి కంపెనీలు కూడా ఇలాంటి చర్యలు చేపట్టే అవకాశం ఉంది." అని నాస్కామ్ తెలిపింది. ఎఐ ప్రధానంగా మారుతోన్న నేపథ్యంలో నిర్దిష్ట నైపుణ్యాలు, అత్యంత ప్రత్యేక నైపుణ్యాల కోసం నియామకాలపె కంపెనీలు దృష్టి సారిస్తాయని నాస్కామ్ పేర్కొంది. ఈ మార్పులు స్వల్పకాలిక ఉద్యోగ నష్టాలకు దారితీసినప్పటికీ, కొత్త ఉద్యోగ అవకాశాలు సృష్టించబడుతాయని ఆశాభావం వ్యక్తం చేసింది. ఆటో పరిశ్రమ ఎఐ, ఆటోమేషన్ ద్వారా గణనీయమైన మార్పులకు లోనవుతోంది. ఇది స్వల్పకాలంలో ఉద్యోగ కోతలకు దారితీసినప్పటికీ, నిరంతర అధ్యయనం, నైపుణ్యాభివృద్ధి ద్వారా కొత్త ఉద్యోగ అవకాశాలు సృష్టించబడుతాయని.. ఈ క్రమంలో ఐటి నిపుణులు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తమ స్కిల్స్‌ను ఎప్పటికప్పుడు పెంచుకోవాలని నాస్కామ్ సూచించింది.

## పీ అండ్ జీ పగ్గాలు భారతీయుడి చేతికి



మరో ప్రముఖ బహుళజాతి కంపెనీకి భారతీయుడు సారథ్యం వహించను న్నారు. అమెరికన్ ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం ప్రాక్టర్ అండ్ గాంబుల్ (పీ అండ్ జీ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా శైలేష్ జెజురికర్ నియమితులయ్యారు. 58 ఏళ్ల జెజురికర్ వచ్చే ఏడాది జనవరి 1 నుంచి కొత్త బాధ్యతలను చేపట్టనున్నా రు. 1989లో ఈ కంపెనీలో అసిస్టెంట్ బ్రాండ్ మేనేజర్‌గా చేరిన శైలేష్.. అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. గత ఆరేళ్లుగా కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ప్రముఖ లిఫ్ట్‌ల తయారీ సంస్థ ఓటిస్ ఎలివేటర్స్ కంపెనీ బోర్డు సభ్యుడిగా కూడా కొనసాగుతున్నారు. నాయకత్వ మార్పులో భాగంగా పీ అండ్ జీ ప్రస్తుత సీఈఓ జాన్ మోల్లెర్ స్థానంలో శైలేష్ నియ మితులయ్యారు. ఈ అక్టోబరులో జరగనున్న వాటాదారుల సమావేశంలో డైరెక్టర్ పదవికి పోటీ చేసేందుకు సైతం కంపెనీ బోర్డు జెజురికర్‌ను నామినేట్ చేసినట్లు పీ అండ్ జీ తెలిపింది. మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్ ఆటో, వ్యవసాయ యంత్రాల విభాగ సీఈఓ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేశ్ జెజురికర్ చిన్న తమ్ముడే శైలేష్. కాగా, భారతీయ సంతతి నాయకులు కేవలం సాంకేతికతనే కాదు, అమెరికన్ వినియోగదారుల హృదయాలను, మనస్సులను కూడా దోచుకోగలరని పీ అండ్ జీ సీఈఓగా శైలేష్ నియామకం మరోసారి నిరూపించిందని మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా అన్నారు. శైలేష్ జెజురికర్‌కు హైదరాబాద్‌తోనూ ప్రత్యేక అనుబంధం ఉంది. ఆయన బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్నారు.

# భారత్‌తో ట్రేడ్ డీల్ ఇంకా కుదరలేదు

# ఆగస్టు 1 లోపు ఒప్పందం కుదరకపోతే..

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సుంకాల విధింపులో బిజీగా ఉన్నారు. మిత్ర దేశం, శత్రు దేశం అని చూడకుండా అన్ని దేశాలపై సుంఖాలు బాదేస్తున్నారు. దారికి వచ్చారా ఒకే.. లేదంటే కాచుకోండి అంటూ హెచ్చరిస్తున్నారు. ట్రేడ్ డీల్ కుదరకపోతే దబిడి దిబిడి అంటున్నారు ట్రంప్. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సుంకాల విధింపులో బిజీగా ఉన్నారు. మిత్ర దేశం, శత్రు దేశం అని చూడకుండా అన్ని దేశాలపై సుంఖాలు బాదేస్తున్నారు. దారికి వచ్చారా ఒకే.. లేదంటే కాచుకోండి అంటూ హెచ్చరిస్తున్నారు. ట్రేడ్ డీల్ కుదరకపోతే దబిడి దిబిడి అంటున్నారు ట్రంప్. భారత్‌తో వాణిజ్య ఒప్పందం ఇంకా కుదరలేదన్నారు ట్రంప్. ఆగస్టు 1 లోపు ఒప్పందం కుదరకపోతే గరిష్ఠంగా 25 శాతం సుంకాలు విధించే అవకాశం ఉందన్నారు. 20 నుంచి 25 శాతం సుంకాలు విధించే యోచనలో ఉన్నామని స్పష్టం చేశారు అమెరికా అధ్యక్షుడు. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ తమపై భారీగా సుంకాలు విధించిందని ట్రంప్ ఆక్షేపించారు. ఆగస్టు 1 సుంకాల విడుదల లిస్టులో యూరోపియన్ యూనియన్, మెక్సికో ఉన్నాయి. జుఖ నుంచి కంపెనీలు కొట్టు కట్టేసి, అమెరికా బాట పట్టేలా వ్యూహం పన్నారు ప్రపంచపు పెద్దన్న. ఇక మన దేశంపై ట్రంప్ బాదుడు తగ్గించడానికి మనవాళ్లు చర్చల మంత్రం పఠిస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ తాజా



కామెంట్స్ ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇప్పటికే యూరోపియన్ యూనియన్, మెక్సికో ఉత్పత్తులపై 30 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఆగస్టు 1వ తేదీ నుంచే ఈ సుంకాలు అమల్లోకి వస్తాయని వెల్లడించారు. అక్రమ వలసదారులు, మత్తు పదార్థాలు అమెరికాలోకి ప్రవేశించకుండా నిరోధించడానికి మెక్సికో ప్రభుత్వం తమకు చక్కగా సహకరిస్తోందని, ఆ దేశానికి రాసిన లేఖలో ట్రంప్ ప్రశంసించారు. యూరోపియన్ యూనియన్‌లో 27 సభ్య దేశాలు ఉన్నాయి. ఈయూ నుంచి వాహన, ఔషధ, వైద్య కంపెనీలు అమెరికాకు తిరిగి వచ్చేలా, వాళ్లపై భారీగా టారిఫ్ వడ్డించారు ట్రంప్. పన్నుల భారం తట్టుకోలేక ఆయా కంపెనీలు అమెరికాలో తమ ఉత్పత్తులను తయారు చేస్తాయని ఈ ఎత్తుగడ పన్నారు ట్రంప్. ఇప్పటిదాకా 24 దేశాలతోపాటు ఈయూపై టారిఫ్‌లను ప్రకటించారు. మరికొన్ని దేశాలపై సుంకాలను త్వరలో ప్రకటించే అవకాశం ఉంది. ఏ రెండు దేశాల మధ్యనైనా సరే టారిఫ్‌లు ఒకేరకంగా ఉండాలని ట్రంప్ వాదిస్తున్నారు. ఒక దేశం నుంచి వచ్చే దిగుమతులపై అధికంగా సుంకాలు వసూలు చేస్తూ.. అదే దేశానికి ఎగుమత ౕయ్యే మన ఉత్పత్తులపై సుంకాలు తక్కువగా ఉండాలని కోరుకోవడం న్యాయం కాదంటున్నారు ట్రంప్. ఇక తాత్కాలిక వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడంపై అమెరికా, భారత్ చాలా నెలలుగా పనిచేస్తున్నాయి. ఈ ఏడాది చివర్లో పూర్తి స్థాయి ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు మార్గం సుగమమవు తుందంటున్నారు. అయితే, పూర్తి స్థాయి ఒప్పందం ఎప్పుడు ఖరారవుతుందో క్లారిటీ లేదు. తాత్కాలిక ఒప్పందం ఖరారైతే, అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్న దేశాల జాబితాలో ఇండియా చేరుతుంది.

# మళ్లీ భగ్గుమన్న బంగారం ధరలు..

రానున్న రోజుల్లో పండలల సీజన్ మొదలవుతుంది. ఇప్పుడు ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని బులియన్ మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో బంగారం ప్రియులు కొనుగోళ్ల విషయంలో ఆలోచనలో పడిపోయారు. బులియన్ మార్కెట్లో బంగారం ధరలు ఎప్పటికప్పుడు మారుతున్నాయి. ఒక స్వల్పంగా పెరిగితో మరో రోజు అంతకు రెట్టింపుగా పెరుగుతోంది. జూలై 29న ఉదయం 6 గంటల సమయానికి బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. అంటే తులం బంగారం ధర 99 వేల్లోనే ట్రేడయ్యింది. కానీ మధ్యాహ్నం 12 గంటల సమయానికి పరిశీలిస్తే భారీగా ఎగబాకింది. బంగారం కొనుగోలు చేసే మహిళలకు గట్టి షాకిచ్చింది. ఇప్పుడు 24 క్యారెట్ల పది గ్రాముల ధరపై ఏకంగా 660 రూపాయలు పెరిగి 1 లక్షా 480 రూపాయల వద్ద కొనసాగుతోంది. అదే 22 క్యారెట్ల 10 గ్రాములపై 600 రూపాయల మేరకు పెరిగి తులం ధర 92,210 వద్ద కొనసాగుతోంది. ఇక వెండి విషయానికొస్తే నేనుందుకు తగ్గాలే అన్నట్లుగా కిలో వెండిపై వెయ్యి రూపాయల వరకు పెరిగి ప్రస్తుతం కిలో వెండి ధర 1 లక్షా17 వేల రూపాయల వద్ద నమోదైంది. ఇక చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా నగరాల్లో అయితే 1 లక్షా 27 వేల వరకు ఉంది. తెలుగు రాష్ట్రాల్లో బంగారం ధరలు మరోసారి భారీగా పెరిగాయి. గత కొద్ది రోజులుగా స్వల్పంగా తగ్గిన ఈ పసిడి ధరలు తాజాగా ఊహించని రీతిలో మళ్లీ ఎగబాకాయి. మార్కెట్‌లో ప్రస్తుతం బంగారం కొనాలంటేనే భయపడిపో తున్నారు. సామాన్యులకు సైతం అందని ద్రాక్షలా మారిపోయింది. హైదరాబాద్, విజయవాడ వంటి ప్రధాన నగరాల్లో బంగారం ధరలు లక్ష రూపాయలు దాటేశాయి. పండుగ సీజన్ మొదలవుతున్న నేపథ్యంలో బంగారం ధరలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని బులియన్ మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా వినాయక చవితి, దసరా, దీపావళి వంటి ప్రధాన పండుగలకు రానున్నాయి. ఈ నేపథ్యంలో ధరలు మరింత భగ్గుమనేలా ఉంటాయని చెబుతున్నారు. ఇప్పటికే బంగారం కొనాలంటేనే భారంగా మారిన మహిళల కు.. మున్ముందు గ్రాము కొనాలన్న కూడా కొనలేని పరిస్థితి ఉండే అవకాశం ఉంది. మధ్యప్రాచ్యంలో



పెరుగుతున్న ఉద్రిక్తతలు, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు వంటి అంశాలు బంగారం ధరలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. రూపాయి విలువ డాలర్ తో పోలిస్తే తగ్గినప్పుడు, బంగారం దిగుమతి ఖరీదైనదిగా మారుతుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అప్పట్లో విధించిన టారిఫ్ సుంకాలు ఆగస్టు 1 నుంచి మళ్లీ అమల్లోకి రానున్న నేపథ్యంలో పెట్టుబడిదారులు బంగారాన్ని సురక్షిత ఆస్తిగా పరిగణిస్తున్నారు.

# ఐసీసీ ర్యాంకింగ్స్.. టీ20 నెంబర్ వన్ బ్యాట్స్‌మెన్స్‌గా అభిషేక్ శర్మ

ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. భారత స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ ట్రావిస్ హెడ్‌ను అధిగమించి టీ20ల్లో నంబర్ వన్ బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. వెస్టిండీస్‌తో జరిగిన టీ20 సిరీస్ ఆడకపోవడంతో హెడ్ ఒక స్థానం దిగజారి రెండోస్థానానికి పడిపోయాడు. అభిషేక్ కెరీర్‌లో ఇదే అత్యుత్తమ ర్యాంక్ కావడం విశేషం. అంతే కాదు. టెస్ట్, వన్డే, టీ20 మూడు ఫార్మాట్లలో (బ్యాటింగ్, బౌలింగ్, ఆల్‌రౌండర్) భారత ఆటగాళ్లు ఆధిపత్యం కొనసాగిస్తున్నారు. అభిషేక్‌తో పాటు శుభ్‌మాన్ గిల్ వన్డేలలో నంబర్ వన్ బ్యాట్స్‌మగా ఉండగా.. జస్ప్రీత్ బుమ్రా టెస్ట్ బౌలర్లలో నంబర్ వన్‌గా కొనసాగుతున్నాడు. అదే సమయంలో టెస్ట్ ఆల్ రౌండర్లలో రవీంద్ర జడేజా నంబర్ వన్, టీ20 ఆల్ రౌండర్లలో హార్దిక్ పాండ్యా నంబర్ వన్‌గా ఉన్నారు. జట్టు ర్యాంకింగ్స్‌లో వన్డేలు, టీ20ల్లో భారత జట్టు నెంబర్ వన్‌గా కొనసాగుతున్నది. అభిషేక్ ప్రస్తుతం 829 రేటింగ్ పాయింట్లతో నెంబర్ వన్ స్థానంలో ఉండగా.. ట్రావిస్ హెడ్ 814 రేటింగ్ పాయింట్లతో రెండోస్థానంలో కొనసాగుతున్నాడు. అభిషేక్ శర్మ ఇప్పటి వరకు టీమిండియా తరపున 17 టీ20 మ్యాచులు ఆడి 33.44 సగటు 193.85 స్ట్రయిక్ రేట్‌తో 535 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, మరో రెండు హాఫ్ సెంచరీలున్నాయి. బౌలింగ్ చేసి ఆరు వికెట్లు పడగొట్టాడు.



విధ్వంసక ఓపెనర్‌గా గుర్తింపు పొందిన అభిషేక్.. టీ20ల్లో కీలక ఆటగాడిగా మారాడు. అదే సమయంలో ఐసీసీ టెస్ట్ ఆల్ రౌండర్లలో రెండవ స్థానంలో ఉన్న బంగ్లాదేశ్‌కు చెందిన మెహదీ హసన్ మీరాజ్ కంటే.. టీమిండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 117 రేటింగ్ పాయింట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నాడు. ఐసీసీ విడుదల చేసిన ప్రకటనలో ఆల్‌రౌండర్ల జాబితాలో నెంబర్ వన్‌గా ఉన్నాడని తెలిపింది. 422 పాయింట్లతో బంగ్లాదేశ్‌కు చెందిన మెహదీ హసన్ మిరాజ్ కంటే 117 పాయింట్లు ముందంజలో ఉన్నాడు. జడేజా ఐదు స్థానాలు ఎగబాకి బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్‌లో 29వ స్థానానికి, బౌలర్లలో ఒక స్థానం 14వ స్థానానికి చేరుకున్నాడు. టెస్ట్ బ్యాట్స్‌మెన్‌లలో వాషింగ్టన్ సుందర్ ఎనిమిది స్థానాలు ఎగబాకి 65వ స్థానానికి చేరుకున్నాడు. మాంచెస్టర్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన నాల్గవ టెస్ట్‌లో జడేజాతో కలిసి ఐదవ వికెట్‌కు 203 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పిన విషయం తెలిసిందే. సుందర్ ఎనిమిది స్థానాలు ఎగబాకి ఆల్ రౌండర్ల జాబితాలో 13వ స్థానానికి చేరుకున్నా డు. ఈ మ్యాచ్‌లో రెండు వికెట్లు కూడా తీసుకున్నాడు. ఇక టెస్టుల్లో జో రూట్ నెంబర్ వన్ బ్యాట్స్‌మెన్‌గా కొనసాగుతుం డగా.. న్యూజిలాండ్‌కు చెందిన కేన్ విలియమ్సన్ రెండవ స్థానంలో ఉన్నాడు. ఇంగ్లాండ్‌కు చెందిన హ్యారీ బ్రూక్ మూడో స్థానంలో ఉన్నాడు. ఇంగ్లాండ్‌కు బ్యాటర్ బెన్ డకెట్ ర్యాంకింగ్ 10వ స్థానానికి చేరుకున్నాడు. జాక్ క్రౌలీ 43వ స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ టెస్ట్ ఆల్ రౌండర్ల జాబితాలో మూడు స్థానాలు ఎగబాకి మూడో స్థానానికి చేరుకున్నాడు. డిసెంబర్ 2022 తర్వాత ఇదే అత్యుత్తమ ర్యాంకింగ్. మాంచెస్టర్‌లో ఇంగ్లాండ్ ఆడిన ఏకైక ఇన్నింగ్స్‌లో రూట్ 150 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. స్టోక్స్ ఐదు వికెట్లు తీయడమే కాకుండా 141 పరుగులు చేశాడు. బౌలర్లలో నాలుగు సంవత్సరాల తర్వాత టెస్ట్ జట్టులోకి తిరిగి వచ్చిన జోఫ్రా ఆర్చర్ 38 స్థానాలు ఎగబాకి 63వ స్థానానికి చేరుకున్నాడు. క్రిస్ వోక్స్ ఒక స్థానం ఎగబాకి 23వ స్థానానికి చేరుకున్నాడు.

# పాక్‌తో ఆడే ముచ్చటే లేదు..

# సెమీఫైనల్ బాయ్‌కాట్‌కు సిద్ధమవుతున్న మాజీ ఆటగాళ్లు..!

ఆసియా కప్ షెడ్యూల్ వచ్చినప్పటి నుంచీ భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌పై నెట్టింట జోరుగా చర్చ సాగుతోంది. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దాయాది దేశంతో క్రికెట్ వద్దే వద్దని అభిమానులు బీసీసీఐని విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో మాజీ ఆటగాళ్లు మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ పాక్‌తో ఆడేది లేదని తేల్చి చెబుతున్నారు. వరల్డ్ ఛాంపియన్స్ ఆఫ్ లెజెండ్ టోర్నీలో ఇప్పటికే పాక్‌తో లీగ్ మ్యాచ్ ఆడని ఇండియా ఛాంపియన్స్ జట్టు ఆటగాళ్లు అదే మాటకు కట్టుబడి ఉన్నారు. పాక్‌తో సెమీ ఫైనల్ అయినా సరే ఆడమని తెగేసి చెప్పిన శిఖర్ ధావన్ హర్భజన్ సింగ్, యువరాజ్‌లు.. మ్యాచ్‌నూ బాయ్‌కాట్ చేయాలని భావిస్తున్నారు. దాంతో, డబ్ల్యూసీఎల్ నుంచి ఇండియా ఛాంపియన్స్ నిష్క్రమించనుం ది. జూలై 31న ఎడ్జ్‌బాస్టన్ వేదికగా సెమీస్ జరగాల్సి ఉంది. అయితే.. భారత మాజీలు మాత్రం పాక్‌తో తలపడేందుకు అయిష్టం వ్యక్తం చేస్తున్నారు. అయితే.. అధికారికి ప్రకటన వెలువడాల్సి ఉంది. ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాలతో భారత్, పాక్‌ల మధ్య క్రికెట్ సంబంధాలపై అనిశ్చితి కొనసాగుతోంది. ఐసీసీ టోర్నీల్లో మాత్రమే ఆడేందుకు ఇరుబోర్డులు అంగీకరిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో టీమిండియా మాజీ ఆటగాళ్లు మాత్రం దాయాది జట్టుతో మ్యా ఆడేందుకు ససేమిరా అంటున్నారు. వరల్డ్ ఛాంపియన్స్ లీగ్ ఆఫ్ లెజెండ్స్‌లో భాగంగా జూలై 20 ఆదివారం జరగాల్సిన మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేశారు. ఇకపై కూడా అదే రిపీట్ అవుతుందని అన్నాడు ధావన్. చిరకాల ప్రత్యర్థులు సెమీస్ చేరితే అప్పుడు ఏం చేస్తారు? అని మీడియా ప్రశ్నించగా.. గబ్బర్ మాత్రం తన నిర్ణయం మార్చుకోనని స్పష్టం చేశాడు. అతడు చెప్పినట్టే భజ్జీ, యూవీలు సైతం పాక్‌తో ఆడమని



భీష్మించుకొని ఉన్నారు. దాంతో, ఐసీసీ సెమీస్‌ను రద్దు చేయనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. సో.. గత సీజన్ విజేత అయిన ఇండియా ఛాంపియన్స్ ఈసారి ఉత్త చేతులతోనే ఇంటిబాట పట్టనుంది.

# స్పోర్ట్స్

## భారత్‌తో ఐదో టెస్ట్‌కు ముందు ఇంగ్లండ్ జట్టుకు భారీ షాక్.. తుది జట్టులో 4 మార్పులు



లండన్‌లోని కెన్నింగ్టన్ ఓవల్ మైదానం వేదికగా రేపటి నుంచి (జులై 31) టీమిండియాతో ప్రారంభం కాబోయే ఐదో టెస్ట్‌కు ముందు ఇంగ్లండ్ జట్టుకు అతి భారీ షాక్ తగిలింది. ఆ జట్టు కెప్టెన్, ఇన్ ఫామ్ ప్లేయర్ బెన్ స్టోక్స్ భుజం గాయం కారణంగా కీలకమైన మ్యాచ్‌కు దూరమయ్యాడు. స్టోక్స్ మాంచెస్టర్‌లో జరిగిన నాలుగో టెస్ట్‌లో ఏకంగా 35 ఓవర్లు వేసి గాయాన్ని కొని తెచ్చుకున్నాడు. ఆ మ్యాచ్ సెకెండ్ ఇన్నింగ్స్‌లో టీమిండియా బ్యాటర్లు వీరోచితంగా పోరాడుతున్న సమయంలోనే స్టోక్స్ చాలా అసౌకర్యంగా కనిపించాడు. అప్పుడే అతని పని అయిపోయిందని అంతా అనుకున్నారు. నాలుగో టెస్ట్ సెకెండ్ ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్లు ఐదుకు పైగా సెషన్లలో ఏకంగా 143 ఓవర్లు బ్యాటింగ్ చేసి ఇంగ్లండ్ బౌలర్ల రసాన్ని పీల్చారు. స్టోక్స్ దాని బాదితుడే. ఆ మ్యాచ్‌లో స్టోక్స్ బంతితో పాటు బ్యాట్‌తోనూ చెలరేగి (5 వికెట్ల ప్రదర్శన సహా 6 వికెట్లు, సెంచరీ) ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. అంతకుముందు వారు గెలిచిన మూడో టెస్ట్‌లోనూ స్టోక్సే ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. ఆ మ్యాచ్‌లో అతను 77 పరుగులు చేసి, 5 వికెట్లు తీశాడు. ఈ సిరీస్‌లో లీడింగ్ వికెట్ టేకర్‌గా (17 వికెట్లు) నిలవడంతో పాటు బ్యాట్‌తోనూ మంచి టచ్‌లో ఉన్న స్టోక్స్ కీలకమైన ఐదో టెస్ట్‌కు దూరం కావడం ఇంగ్లండ్ విజయావకాశాలను తప్పక ప్రభావితం చేస్తుంది.

కెప్టెన్‌గా పోప్

స్టోక్స్ గైర్హాజరీలో ఐదో టెస్ట్‌లో ఇంగ్లండ్ కెప్టెన్‌గా ఓలీ పోప్ వ్యవహరించనున్నాడు. ఈ మేరకు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు ప్రకటన విడుదల చేసింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ తుది జట్టును కూడా ప్రకటించింది. ఇందులో ఏకంగా నాలుగు మార్పులు చేసింది. గాయపడిన స్టోక్స్ స్థానంలో జేమీ ఓవర్టన్ తుది జట్టులోకి రాగా.. జోఫ్రా ఆర్చర్, బ్రైడన్ కార్స్, లియామ్ డాసన్ స్థానాల్లో జేకబ్ బేతెల్, గస్ అట్కిన్సన్, జోష్ టంగ్‌లకు తుది జట్టులో స్థానం కల్పించింది. జేకబ్ బేతెల్ ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తాడని స్పష్టం చేసింది. కాగా, ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భారత్ ప్రస్తుతం 1-2తో వెనుకపడి ఉంది. ఇందులో 1,3 మ్యాచ్‌లు ఇంగ్లండ్ గెలువగా.. భారత్ రెండో మ్యాచ్‌లో విజయం సాధించింది. నాలుగో టెస్ట్ డ్రాగా ముగిసింది. ఐదో టెస్ట్‌లో భారత్ విజయం సాధిస్తే సిరీస్ సమం అవుతుంది. ఓడినా, డ్రా అయినా ఇంగ్లండ్ వశమవుతుంది. ఇలాంటి కీలక మ్యాచ్‌లో ఇన్ ఫామ్ ఆల్‌రౌండర్ స్టోక్స్ లేకపోవడం భారత్‌కు తప్పక కలిసొచ్చే విషయమే.



# సరికొత్త అందాలతో మెరిసిన ఖుషి కపూర్..



## ఆ విషయంలో మేము పాస్ అయ్యాం : నాగవంశీ

'ఈమధ్య కాలంలో సినిమాలకు ఓపెనింగ్స్ రాబట్టడం పెద్ద ఛాలెంజ్ అయిపోయింది. ఆ పరంగా చూస్తే మేము(కింగ్‌డమ్) పాస్ అయ్యాం. బుకింగ్స్ బాగున్నాయి. మంచి వసూళ్లతో సినిమా ఘన విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాను'అన్నారు నిర్మాత సూర్యదేవర నాగవంశీ. విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే హీరోహీరోయిన్లుగా నటించిన తాజా చిత్రం 'కింగ్‌డమ్'. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సత్యదేవ్ కీలక పాత్ర పోషించాడు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం తాజాగా మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా నాగ వంశీ మాట్లాడుతూ.. 'ఇది పూర్తిస్థాయి యాక్షన్ చిత్రం కాదు. గౌతమ్ తిన్ననూరి శైలి ఎమోషన్స్ ఉంటాయి. అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చే అంశాలతో తెరకెక్కిన గ్యాంగ్ స్టర్ డ్రామా ఇది. ఈ సినిమా కోసం సెట్స్ వేయలేదు. ఎక్కువ భాగం రియల్ లొకేషన్స్ లో షూట్ చేశాం. మా టీమ్ పడిన కష్టం మీకు తెర మీద కనిపిస్తుంది." అన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. 'జెర్సీ' సినిమా తీసిన గౌతమ్ తిన్ననూరి 'కింగ్‌డమ్' ఇది. ఈ చిత్రంలో భావోద్వేగాలు కట్టిపడేస్తాయి. చరిత్రలో ఏ యుద్ధం చూసుకున్నా.. కుటుంబం కోసమో, పుట్టిన నేల కోసమో, ప్రేమ కోసమో ఉంటుంది. ఈ యుద్ధం కూడా అలాంటిదే. కుటుంబ భావోద్వేగాల నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. సినిమా మొదలైన రెండు నిమిషాలకే ప్రేక్షకులు 'కింగ్‌డమ్' ప్రపంచంలోకి వెళ్తారు. థియేటర్ కి వచ్చిన ప్రతి ఒక్కరికీ ఈ చిత్రం మంచి అనుభూతిని ఇస్తుంది." అన్నారు. 'విజయ్ లాంటి నటుడితో కలిసి నటించడం సంతోషంగా ఉంది. ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని భాగ్యశ్రీ బోర్సే అన్నారు.



## హీరో, దర్శకుడు నన్ను ట్రై చేశారు..
### నిత్యా మీనన్ షాకింగ్ కామెంట్స్

మల్టీటాలెంటడ్ యాక్టర్స్‌లో నిత్యా మీనన్ ఒకరు. అలామొదలైంది సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఈ అమ్మడు ఆ తర్వాత చాలా సినిమాల్లో నటించి మెప్పించింది. ఈ మధ్య కాలంలో సినిమాల స్పీడ్ తగ్గించింది. స్లో అండ్ స్టడీగా సినిమాలు చేసుకుంటూ వెళుతుంది. 'అలా మొదలైంది' నుంచి 'భీమ్లా నాయక్' వరకూ విభిన్న పాత్రలతో ఆకట్టుకున్న ఈ ముద్దుగుమ్మ రీసెంట్‌గా తమిళ స్టార్ విజయ్ సేతుపతితో కలిసి సార్ మేడమ్ అనే చిత్రం చేసింది. ఈ మూవీ ప్రమోషన్స్‌లో పాల్గొంటూ ఆసక్తికర విషయాలు తెలియజేస్తుంది. నిత్యా మీనన్, విజయ్ సేతుపతి జంటగా నటించిన సార్ మేడమ్ చిత్రం తమిళంతో పాటు తెలుగులో కూడా విడుదల కాబోతోంది. పాండిరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని టీజీ త్యాగరాజన్ సమర్పణలో, సత్య జ్యోతి ఫిల్మ్స్ బ్యానర్‌పై సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మించారు. ఆగస్టు 1న గ్రాండ్ రిలీజ్‌కి సిద్ధమవుతోంది. ఇప్పటికే ప్రమోషన్స్ జోరుగా జరుగుతున్నాయి. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో నిత్యా మీనన్ పాల్గొంది. ఈ సందర్భంగా పెళ్లిపై ఆమెకు ప్రశ్న ఎదురైంది. దానికి సమాధానంగా నన్ను విజయ్ సేతుపతి గారు, దర్శకుడు పాండిరాజ్ గారు చాలా ట్రై చేశారు" అని నవ్వుతూ చెప్పింది. అయితే ఇది కొంచెం డబుల్ మీనింగ్‌గా అనిపించడంతో వెంటనే విజయ్ సేతుపతి జోక్యం చేసుకొని.."సరిగ్గా చెప్పు.. వేరే అర్థాలు వస్తాయి!" అని అన్నారు. దీనిపై వెంటనే నిత్యా క్లారిటీ ఇచ్చింది. "అయ్యో, నేను అలా అనలేదు! పెళ్లి విషయంలో వాళ్లు నన్ను మోటివేట్ చేస్తూ ఉండేవాళు అని చెప్పాలనుకున్నాను" అని వివరణ ఇచ్చింది. ఈ సంఘటనతో అక్కడున్నవారంతా తెగ నవ్వేశారు. ఇక ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది నిత్యా మీనన్ ఇప్పటివరకు తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో పలు హిట్ చిత్రాల్లో నటించి మంచి పేరు తెచ్చుకుంది. ఆమె 6 భాషల్లో మాట్లాడగలదనే టాక్ కూడా ఉంది. విజయ్ సేతుపతి, నిత్యా మీనన్ ఇద్దరికీ తెలుగు ప్రేక్షకుల్లో భారీ ఫాలోయింగ్ ఉంది. అందుకే 'సార్ మేడమ్' సినిమా తెలుగులో కూడా మంచి రెస్పాన్స్ పొందే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది.

## విజయ్ దేవరకొండతో మరోసారి రష్మిక?



టాలీవుడ్ స్టార్ నటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా మరోసారి కలిసి నటించబోతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే వీరిద్దరి కాంబోలో వచ్చిన గీతా గోవిందం, డియర్ కామ్రేడ్ వచ్చి మంచి విజయాలు అందుకున్నాయి. దీంతో ఈ హిట్ జోడి మళ్లీ తెరపై రోమాన్స్ చేయబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. టాక్సీవాలా, శ్యామ్ సింగరాయ్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు రాహుల్ సాంకృత్యాయన్ విజయ్ దేవరకొండతో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. టాక్సీవాలా తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా వస్తుండటంతో మంచి అంచనాలు ఉన్నాయి. వీడీ 14గా రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ నిర్మిస్తుండగా.. హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో రాయలసీమ నేపథ్యంలో ఈ చిత్రం రాబోతుంది. ఇప్పటికే పూజ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే షూటింగ్ ప్రారంభించనుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాలో కథానాయికకు సంబంధించి ఒక వార్త వైరల్‌గా మారింది. ఈ మూవీలో కథానాయికగా మేకర్స్ రష్మిక మందన్నాని అనుకుంటున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే ఫ్యాన్స్‌కి పండగనే చెప్పుకోవాలి. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. సినిమాల విషయానికి వస్తే.. కింగ్‌డమ్ సినిమాతో విజయ్ గురువారం ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ చిత్రానికి గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నాడు. రష్మిక విషయానికి వస్తే.. ప్రస్తుతం మైసా అనే చిత్రంలో నటిస్తుంది.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,